Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు
RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు
rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue) : 248 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)
శుక్రవారం, 15 - 5 - 2026
94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com NI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

# ప్రధాని మోదీ పిలుపుతో కాన్వాయ్ తగ్గించుకున్న ముఖ్యమంత్రి

## - సీఎం 4, లోకేష్ 2 వాహనాలకు పరిమితం



**అమరావతి, (రాజధాని వార్తలు):** ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన వాహన శ్రేణిని కుదించుకున్నారు. మొత్తం 12 వాహనాల కాన్వాయ్‌ను 4 వాహనాలకు తగ్గించుకున్నారు. ఇవాల్టి నుంచే ఈ వాహన శ్రేణి కుదింపును అమల్లోకి తీసుకు రావాలని సీఎం సూచనలు జారీ చేశారు. ఈ మేరకు ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి సచివాలయంలో జరిగే కేబినెట్ సమావేశానికి కేవలం నాలుగు వాహనాల కాన్వాయ్‌తోనే సీఎం చేరుకున్నారు. ఇక నుంచి ఈ నాలుగు వాహన కాన్వాయ్ శ్రేణితోనే ప్రయాణించాలని సీఎం నిర్ణయించారు. అటు మంత్రులు, ప్రజాప్రతినిధులు కూడా ఈ మేరకు వాహన శ్రేణిని తగ్గించుకుని ఇంధనాన్ని ఆదా చేయాలని సీఎం సూచించారు. ఈ మేరకు లోకేష్ 2 వాహనాలకే పరిమితం అయ్యారు.

# అగ్రిగోల్డ్ కేసు.. ముగ్గురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేయాలి: సీఎం ఆదేశం



**అమరావతి, (రాజధాని వార్తలు):** అగ్రిగోల్డ్ బాధితులకు ఆరు నెలల్లో న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఈ మేరకు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. సీఎం అధ్యక్షతన గురువారం సచివాలయంలో కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై మంత్రులతో సీఎం చంద్రబాబు చర్చించారు.

**ముగ్గురు సభ్యులతో కమిటీ..**

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయడానికి సంబంధించి ముగ్గురు సభ్యులతో కమిటీ వేయాలని సీఎం ఆదేశించారు. ఎనిమిది రాష్ట్రాల్లో 19 లక్షల మంది బాధితులు ఉన్నారని తెలిపారు. ఒక్క ఆంధ్రప్ర దేశ్‌లోనే 11 లక్షల మంది బాధితులు ఉన్నారని చెప్పుకొచ్చారు. ఈ కేసులో బాధితుల సొమ్ము తిన్న వారిలో వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలోని కొంత మంది కీలక అధికారులు ఉన్నారని వెల్లడించారు. అందువల్లే ఈ కేసుపై ముగ్గురు సభ్యులతో కమిటీ వేయాలని ఆదేశించారు. అగ్రిగోల్డ్‌లో పెట్టుబడులు పెట్టి మోసపోయిన వారందరికీ తప్పని సరిగా న్యాయం చేయాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

# రాయలసీమ ఇకపై రక్షణ సీమ

## - సీమకు భారీగా డిఫెన్స్ ప్రాజెక్టులు - రూ.15,803 వేల కోట్లతో ఏఎంసిఏ ప్రాజెక్టుకు పుట్టపర్తిలో శంకుస్థాపన - డిఫెన్స్, డ్రోన్ రంగాల్లో మరో 12 ప్రాజెక్టులకూ భూమి పూజ - శుక్రవారం రక్షణ మంత్రితో భూమి పూజ చేయనున్న సీఎం చంద్రబాబు

**అమరావతి, (రాజధాని వార్తలు):** రాయలసీమ రతనాల సీమ... ఇది చరిత్ర. ఉద్యాన సీమ... ఇది వర్తమానం. రక్షణ సీమ... ఇది భవిష్యత్. ఇరిగేషన్, హార్టీకల్చర్, స్పేస్, డ్రోన్, సోలార్, విండ్ ఎనర్జీ వంటి రంగాల్లో దూసుకెళ్తున్న రాయలసీమ డెవలప్మెంట్ జర్నీలో మరో కీలక రంగం జత కానుంది. ఇకపై రాయలసీమ దేశ రక్షణ రంగంలోనూ తన ముద్రను వేయబోతోంది. ప్రత్యేకతను చాటుకోనుంది. శుక్రవారం శ్రీ సత్యసాయి జిల్లాలో దేశం గర్వించే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ డిఫెన్స్ ప్రాజెక్టును ఏరో నాటికల్ డెవలప్మెంట్ ఏజెన్సీ–డీఆర్డీఏ సంస్థలు సంయుక్తంగా ఏర్పాటు చేయనున్నారు. పుట్టపర్తిలో జరగనున్న ఈ కార్యక్రమంలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్‌తో కలిసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భూమి పూజ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్ పాల్గొననున్నారు. ఈ ప్రాజెక్టును సుమారు రూ.15,803 కోట్ల భారీ వ్యయంతో, 650 ఎకరాల్లో ఈ రూపుదిద్దుకోనుంది. ఇది భారతదేశపు మొట్టమొదటి 5th Generation స్టెల్త్ మల్టీ–రోల్ ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రాజెక్ట్. ఇందులో స్టెల్త్ టెక్నాలజీ, ట్విన్ ఇంజిన్ సూపర్ క్రూయిజ్ సామర్థ్యం, అత్యాధునిక ఏవియానిక్స్ వంటి హంగులతో యుద్ధ విమానాలను అభివృద్ధి చేయనున్నారు. యుద్ధ విమానాలను పుట్టపర్తిలోనే అభివృద్ధి చేయడంతోపాటు... టెస్టింగ్ కూడా చేపట్టేలా ప్రాజెక్టును రూపొందించనున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 7,500 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని అంచనా. అలాగే, ఈ ప్రధాన ప్రాజెక్టుకు అనుబంధంగా వచ్చే ఇతర యూనిట్ల ద్వారా మరో రూ.1 లక్ష కోట్ల పెట్టుబడులు వచ్చే అవకాశం ఉంది. దీనికోసం ప్రభుత్వం ప్రత్యేకంగా 400 ఎకరాలు కేటాయించింది. వీటితో పాటు కర్నూలు జిల్లాలో నిర్మిస్తున్న 'డ్రోన్ సిటీ' ద్వారా భారతదేశంలోనే అత్యుత్తమ డ్రోన్ ఎకోసిస్టమ్‌ను ప్రభుత్వం సిద్ధం చేస్తోంది. ఆ మేరకు పెట్టుబడులు భారీ ఎత్తున రానున్నాయి. మొత్తంగా రాయలసీమ, ప్రకాశం జిల్లాల పరిధిలో డిఫెన్స్, డ్రోన్ రంగాల్లో పెద్ద ఎత్తున పెట్టుడులు వచ్చేందుకు ప్రభుత్వం గ్రౌండ్ ప్రిపేర్ చేస్తోంది. దీంట్లో భాగంగా డ్రోన్ ప్రాజెక్టుల ఏర్పాటుకు రంగం సిద్దమవుతోంది. ా వీజూా ప్రాజెక్టుతో పాటే డిఫెన్స్ రంగానికి చెందిన 4 ప్రాజెక్టులు, 8 డ్రోన్ ప్రాజెక్టులకు శంకుస్థాపన జరగనుంది. ఈ 12 ప్రాజెక్టుల ద్వారా రూ. 4145 కోట్ల పెట్టుబడులు, 6071 మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయి. వీటిల్లో మడకశిరలో రెండు ప్రాజెక్టులు, దొనకొండ, నెల్లూరుల్లో ఒక్కో ప్రాజెక్టు ఏర్పాటు కానుంది. మిగిలిన 8 డ్రోన్ ప్రాజెక్టులు కర్నూలు జిల్లా డ్రోన్ సిటీలో నిర్మాణాలు చేపట్టనున్నాయి. ఈ శంకుస్థాపన కార్యక్రమం సందర్భంగా సుమారు రూ. 5 వేల కోట్ల విలువైన పెట్టుబడులకు వివిధ సంస్థల నుంచి ప్రభుత్వం ఎంఓయూలు కుదుర్చుకోనుంది.



**మరో 12 ప్రాజెక్టులకు శంకుస్థాపన...:**

కళ్యాణి స్ట్రాటజిక్ సిస్టమ్స్ లిమిటెడ్ – రూ. 1430 కోట్ల పెట్టుబడి – 565 మందికి ఉపాధి. భారత్ డైనమిక్స్ లిమిటెడ్ – రూ. 489 కోట్ల పెట్టుబడి – 500 మందికి ఉపాధి. HFCL – రూ. 1040 కోట్ల పెట్టుబడి – 870 మందికి ఉపాధి. ప్రీమియర్ ఎక్స్ ప్లోజివ్స్ – రూ. 500 కోట్ల పెట్టుబడి – 2050 మందికి ఉపాధి. అల్గోబాటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ – రూ. 34 కోట్ల పెట్టుబడి – 52 మందికి ఉపాధి. డ్రోగో డ్రోన్స్ ప్రైవేట్ లిమిటెడ్ – రూ. 255 కోట్ల పెట్టుబడి – 850 మందికి ఉపాధి. డ్రోన్ ల్యాబ్ టెక్నాలజీస్ – రూ. 5 కోట్ల పెట్టుబడి – 14 మందికి ఉపాధి. హెచ్‌సి రోబోటిక్స్ – రూ. 100 కోట్ల పెట్టుబడి – 500 మందికి ఉపాధి. సెన్స్ ఇమేజ్ టెక్నాలజీస్ – రూ. 68 కోట్ల పెట్టుబడి – 45 మందికి ఉపాధి. ఎయిర్ పేస్ ఇండస్ట్రీస్ – రూ. 100 కోట్ల పెట్టుబడి – 150 మందికి ఉపాధి. జేడీకే ఫ్లై డ్రోన్ వరల్డ్ – రూ. 114 కోట్ల పెట్టుబడి – 350 మందికి ఉపాధి. లాట్రిక్ ఎయిరో స్పేస్ – రూ. 10 కోట్ల పెట్టుబడి – 125 మందికి ఉపాధి.

**ముఖ్యమంత్రి పర్యటన షెడ్యూల్...**

ముఖ్యమంత్రి పర్యటన ఉదయం 08:15 గంటలకు క్యాంప్ కార్యాలయం నుంచి బయలుదేరి 09:45 గంటలకు పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి రోడ్డు మార్గం ద్వారా ఉదయం 10:15 గంటలకు పుట్టపర్తి ఎయిర్‌పోర్ట్ వెనుక ఏర్పాటు చేసిన ఉన్న శంకుస్థాపన కార్యక్రమ వేదికకు చేరుకుంటారు. ఉదయం 10:15 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలోని ఎయిర్‌క్రాఫ్ట్ ఇంటిగ్రేషన్ – ఫ్లైట్ టెస్ట్ సెంటర్ శంకుస్థాపనతో పాటు, ఇతర రక్షణ, డ్రోన్ రంగ పరిశ్రమల భూమి పూజ కార్యక్రమాల్లో రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ తో కలిసి పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 02:20 గంటలకు తిరిగి అమరావతిలోని తన నివాసానికి చేరుకుంటారు.



# గాంధీసాగర్: ఒక వేసవి విహార కేంద్రం - అన్ని వర్గాల పర్యాటకులకు ఒక ప్రత్యేక ఆకర్షణ





ఈ వేసవి సెలవుల్లో, పర్యాటకులు మధ్యప్రదేశ్‌లోని గాంధీసాగర్ అనే అందమైన ప్రదేశాన్ని తప్పక సందర్శించాలి. ఇది అన్ని వయసుల వారికి ఏదో ఒక ప్రత్యేకతను అందించే ప్రదేశం. ఇక్కడ దేవాలయాలు, అడవులు, ఒక చారిత్రాత్మక కోట, విశాలమైన సరస్సు మరియు సమీపంలో అందమైన వసతి సౌకర్యాలు ఉన్నాయి. ప్రతి సంవత్సరం, మధ్యప్రదేశ్ పర్యాటక మండలి ఇక్కడ ఒక భారీ ఉత్సవాన్ని నిర్వహిస్తుంది, దీనిని ఆస్వాదించడానికి వేలాది మంది పర్యాటకులు వస్తారు. గాంధీసాగర్ దాని ఆనకట్టకు భారతదేశం అంతటా ప్రసిద్ధి చెందింది. చంబల్ నదిపై నిర్మించిన ఈ ప్రాజెక్ట్ 1954లో ప్రారంభమై 1960లో పూర్తయింది. ఈ ప్రాంతం దాని సహజ సౌందర్యానికి మరియు ప్రశాంతమైన వాతావరణానికి ప్రసిద్ధి చెందింది, ఇది ప్రశాంతమైన మరియు విశ్రాంతికరమైన విహారయాత్రను కోరుకునే వారికి ఒక ఆదర్శవంతమైన గమ్యస్థానంగా నిలుస్తుంది. ఇది సందర్శకులను ప్రకృతికి మరింత దగ్గర చేసే ప్రదేశం. పర్యాటక శాఖ కార్యదర్శి మరియు మధ్యప్రదేశ్ పర్యాటక బోర్డు మేనేజింగ్ డైరెక్టర్ అయిన డాక్టర్ ఇళయరాజా టి., ఇలా పేర్కొన్నారు. "మేము గాంధీసాగర్ మరియు దాని పరిసర ప్రాంతాలలో అనేక అభివృద్ధి ప్రాజెక్టులపై వేగంగా పనిచేస్తున్నాము. ఈ ప్రాంతంలోని పర్యాటకులకు మరింత సౌకర్యవంతమైన మరియు అనుకూలమైన అనుభవాన్ని అందించే స్థిరమైన టెంటింగ్ యూనిట్ల నిర్మాణానికి మేము 1 కోటి అంచనా వ్యయంతో ప్రణాళిక రచించాము. అంతేకాకుండా, సమీప భవిష్యత్తులో, ఈ ప్రాంతం చిరుతలకు రెండవ నివాసంగా మారనుంది, ఇది పర్యాటకులకు ఉత్కంఠభరితమైన జంగిల్ సఫారీలను ఆస్వాదించడానికి వీలు కల్పిస్తుంది."

**గాంధీసాగర్‌లో సందర్శించవలసిన ప్రదేశాలు:**

చౌరాసీగఢ్ కోట: ఉత్కంఠభరితమైన సుందర దృశ్యాలను మరియు స్థానిక చరిత్రపై అవగాహనను అందించే ఒక చారిత్రాత్మక కోట; దీనిని తరచుగా వన్యప్రాణి సంరక్షణ కేంద్రంతో కలిపి సందర్శిస్తారు.

**గాంధీసాగర్ వన్యప్రాణి సంరక్షణ కేంద్రం:**

చంబల్ నది యొక్క పచ్చని ఒడ్డున నెలకొని ఉన్న గాంధీసాగర్ వన్యప్రాణి సంరక్షణ కేంద్రం, విభిన్న రకాల వృక్షజాలం మరియు జంతుజాలానికి నిలయంగా ఉన్న ఒక శక్తివంతమైన పర్యావరణ వ్యవస్థ. ఈ అభయారణ్యం చిరుతపులులు, సాంబార్ జింకలు మరియు వివిధ పక్షి జాతులతో సహా అనేక రకాల వన్యప్రాణులకు కీలకమైన ఆవాసంగా ఉంది. అందువల్ల ఇది కుటుంబాలకు, వన్యప్రాణి ఫోటోగ్రాఫర్‌లకు మరియు ప్రకృతి ప్రేమికులకు ఒక స్వర్గధామం.

చతుర్భుజనాథ్ నాలా: మధ్యప్రదేశ్‌లోని మందసౌర్ జిల్లాలో భాన్‌పురా సమీపంలో ఉన్న చతుర్భుజనాథ్ నాలా రాతి గుహలు, చంబల్ లోయలో ఒక ప్రధాన మరియు ముఖ్యమైన చరిత్రపూర్వ కళా ప్రదేశంగా ఉన్నాయి. మధ్య రాతియుగం నాటి (సుమారు 35,000 సంవత్సరాల పురాతనమైనదని అంచనా) ఈ ఆశ్రమాలలో, వేట, నృత్యం మరియు దైనందిన జీవిత దృశ్యాలను వర్ణించే ఎరుపు, తెలుపు మరియు ఆకుపచ్చ రంగులలో వేలాది పురాతన చరిత్రపూర్వ రాతి చిత్రాలు ఉన్నాయి. ఇది చరిత్ర ప్రియులకు ఒక ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంది.

గాంధీ సాగర్ డ్యామ్: గాంధీ సాగర్ డ్యామ్ భారతదేశంలోని మధ్యప్రదేశ్ రాష్ట్రంలో చంబల్ నదిపై నిర్మించిన ఒక భారీ రాతి గురుత్వాకర్షణ డ్యామ్; దీని నిర్మాణం 1960లో పూర్తయింది. ఈ నది వెంబడి నిర్మించిన నాలుగు డ్యామ్‌లలో ఒకటిగా, ఇది నీటిపారుదల, వరద నియంత్రణ మరియు జలవిద్యుత్ ఉత్పత్తి (115 మెగావాట్ల సామర్థ్యంతో) వంటి అనేక విధులను నిర్వర్తిస్తుంది. ఈ నిర్మాణం 64 మీటర్ల ఎత్తు మరియు 950 మీటర్ల పొడవున విస్తరించి ఉంది. ఇది ఒక ప్రసిద్ధ పర్యాటక ప్రదేశం–దాని సుందరమైన జలాశయం కోసం తరచుగా సందర్శిస్తారు–మరియు గాంధీ సాగర్ వన్యప్రాణి సంరక్షణ కేంద్రానికి సమీపంలో ఉంది.

గాంధీ సాగర్ ఫారెస్ట్ రిట్రీట్: గాంధీ సాగర్ ఫారెస్ట్ రిట్రీట్ (గాంధీ సాగర్ ఫ్లోటింగ్ ఫెస్టివల్ అని కూడా పిలుస్తారు) అనేది మధ్యప్రదేశ్‌లోని మందసౌర్ జిల్లాలో ఉన్న ఒక ప్రముఖ గ్లాంపింగ్ మరియు సాహస గమ్యస్థానం. "ఆసియాలోనే మొట్టమొదటి ఫ్లోటింగ్ ఫెస్టివల్"గా ప్రసిద్ధి చెందిన ఈ కార్యక్రమం, నీరు, భూమి మరియు గాలి వాతావరణాలలో నిర్వహించబడే అనేక రకాల సాహస క్రీడలు మరియు కార్యకలాపాలతో పాటు విలాసవంతమైన వసతి సౌకర్యాలను అందిస్తుంది. మధ్యప్రదేశ్ పర్యాటక బోర్డు 2023లో ఈ ఉత్సవం యొక్క మొదటి ఎడిషన్‌ను ప్రారంభించింది. ఇప్పటి వరకు, ఈ ఉత్సవం యొక్క నాలుగు ఎడిషన్లు విజయవంతంగా నిర్వహించబడ్డాయి. చీతా ప్రాజెక్ట్: కునో నేషనల్ పార్క్ తర్వాత, గాంధీ సాగర్ వన్యప్రాణుల అభయారణ్యం భారతదేశంలో చీతాలకు అధికారికంగా రెండవ నివాసంగా మారింది.

ప్రస్తుతం, మూడు చీతాలు అభయారణ్యం యొక్క సురక్షితమైన ఆవరణలలో నివసిస్తున్నాయి. 2025లో, రాష్ట్ర ముఖ్యమంత్రి డాక్టర్ మోహన్ యాదవ్ ఈ మూడు చీతాలను గాంధీ సాగర్‌లో విడుదల చేశారు.

# విదేశాలలో ఉద్యోగ అవకాశాలు

**కాకినాడ, (రాజధాని వార్తలు):** నైపుణ్యం కలిగిన యువకులకు దుబాయ్‌లో ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు కాకినాడ జిల్లా కలెక్టర్ మరియు మేజిస్ట్రేట్ ఎంఎన్ హరేంధీర ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. టాక్సీ డ్రైవర్ వృత్తిలో దుబాయ్‌లో ఉపాధి కల్పించేందుకు ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు ఆయన చెప్పారు. పదవ తరగతి అర్హత కలిగి, 25 నుండి 45 సంవత్సరాల వయస్సు కలిగినవారు అర్హులని తెలిపారు. దుబాయ్‌లో నెలకు సుమారు లక్ష నుండి లక్షా 30 వేల వరకు సంపాదించుకునే అవకాశం ఈ ఉద్యోగాలలో ఉంటుందని తెలిపారు. రెండు సంవత్సరాల కాంట్రాక్ట్‌పై నియామకాలు జరుగుతాయని, లైసెన్స్ ట్రైనింగ్ సమయంలో నెలకి సుమారు రూ.13000, వసతి ఇస్తారన్నారు. అభ్యర్థులు ప్రాసెసింగ్ ఫీజు, వీసా, ఫ్లైట్ చార్జీలతో కలిపి రూ.1 లక్షలు చెల్లించాల్సి ఉంటుందని, పాస్ పోర్ట్, బయో డేటా, విద్యా సర్టిఫికెట్లు, డ్రైవింగ్ లైసెన్స్ పత్రాలూ తప్పనిసరిగా ఉండాలన్నారు. ఈ ఉద్యోగాల సమాచారాన్ని సంక్షిప్తంగా తెలిపే ఒక ఫ్లయ్యర్‌ను కలెక్టర్ బుధవారం ఆయన తన ఛాంబరులో విడుదల చేసారు. ఈ ఉద్యోగాలకు ధరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ, ఇంటర్వ్యూ తేదీని మే 19గా నిర్ణయించారని, ఇంటర్వ్యూ అడ్రస్ – గవర్నమెంటు ఐటిఐ, విజయవాడ అని తెలిపారు. ఆశక్తి గల అభ్యర్థులు ఆన్లైన్లో https://naipunyam.ap.gov.in/user-registration page=program-registration నందు నమోదు చేసుకోవాలని ఆయన తెలిపారు. మరిన్ని వివరాలకు 99888 53335, 99662 91339 నంబర్లను సంప్రదించవచ్చని జిల్లా కలెక్టర్ హరింధిర ప్రసాద్ తెలియజేసారు.

# మహానాడుకు పక్కా ప్రణాళికతో ఏర్పాట్లు : మంత్రి పార్థసారధి



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా నెల్లూరులో నిర్వహిస్తున్న మహానాడుకు పక్కా ప్రణాళికతో ఏర్పాట్లు చేస్తున్నట్లు రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. బుధవారం ఉదయం కొడవలూరు మండలం చంద్రశేఖరపురం వద్ద ఉన్న ఇఫ్కో కిసాన్ సెజ్ ప్రాంతంలో మహానాడు ఏర్పాట్లను సహచర మంత్రులతో కలిసి మంత్రి పార్థసారథి పరిశీలించారు. మహానాడు నిర్వహణకు సంబంధించిన నిర్వహించిన సన్నాహక సమావేశంలో మంత్రి పాల్గొని పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి మాట్లాడుతూ ఈ నెల 27, 28, 29 తేదీల్లో కనీవినీ ఎరుగని రీతిలో...నెల్లూరు చరిత్రలో చిరస్థాయిగా నిలిచేలా మహా నాడు నిర్వహణకు పక్కా ప్రణాళికతో ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. తెలుగుదేశం పార్టీ అధినాయకత్వం ఆదేశాల మేరకు మహానాడు ఏర్పాట్లలో ఎక్కడ రాజీ పడకుండా అత్యంత వైభవంగా తెలుగు దేశం పార్టీ పండుగను నెల్లూరు జిల్లాలో విజయవంతంగా నిర్వహించేందుకు తెలుగుదేశం పార్టీ నేతలు అందరూ సమష్టిగా కృషి కృషి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. మహానాడు ఏర్పాట్ల పరిశీలనలో పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, మంత్రులు ఆనం రామ నారాయణరెడ్డి, పొంగూరు నారాయణ, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, ఆర్ అండ్ బి శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, హోంమంత్రి వంగలపూడి అనిత, ఇంచార్జి మంత్రి ఫరూక్, వాసంశెట్టి సుభాష్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, జిల్లాకు చెందిన శాసనసభ్యులు పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# భూసారాన్ని అభివృద్ధి చేసుకోవటం ప్రతి ఒక్కరి బాధ్యత : ఏ డీ ఏ ఎన్.మోహన్ రావు





**గుంటూరు ప్రతినిధి, (రాజధాని వార్తలు):** రైతులు రసాయనిక ఎరువులు అధికంగా వాడుట వలన భూములు సారవంతం కోల్పోయి, చవుడు బారుతున్నాయని దీని నివారణకు రైతులు పచ్చిరొట్ట ఎరువులయిన జీలుగ, జనుము, పిల్లిపెశర విత్తనాలు వేసుకుని, పైరు 45 రోజులపుడు కలియ దున్నాలని గుంటూరు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఎన్.మోహన్‌రావు అన్నారు. గురువారం పెదకాకాని మండల వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయంలో ధాత్రి మాత బచావో అభయాన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పచ్చిరొట్టతో పాటు సూపర్ ఫాస్ఫేట్ ఎరువును వేసుకున్నట్లయితే భూమి బాగా గుల్లబారి, సారవంతం అవుతుందన్నారు. ఈ సందర్భంగా రైతులకు ఎరువుల వాడకంపై, వాటి యొక్క మోతాదుపై, ఏ పంటకు ఎంత మోతాదులో ఎరువులు వేయాలో, రైతులు ఎంత వేస్తున్నారు అనే దానిపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం వ్యవసాయ శాఖ ద్వారా జీలుగ, జనుము పిల్లి పెసర మొదలైన పచ్చి రొట్ట విత్తనాలను 50 శాతం సబ్సిడీపై పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. సబ్సిడీపై జీలుగ కేజీ 80 రూపాయలకు, జనుములు కేజీ 77 రూపాయలకు, పిల్లి పెసర కేజీ 98 రూపాయలకు ఇవ్వబడుతుంది. కనుక రైతు సోదరులందరూ తక్కువ ఖర్చుతో తక్కువ సమయంలో నేల సారాన్ని పెంచుకోవాలని కోరుకునే ప్రతి రైతు పచ్చిరొట్ట పంటలు వేసి నేల ఆరోగ్యాన్ని పునరుద్ధించడంలో కీలక పాత్రను పోషించి పంటల ఉత్పాదకతను మెరుగుపరచడంలో గణనీయమైన పాత్ర పోషించాలని కోరినారు. మండల వ్యవసాయ అధికారి రమణ కుమార్ మాట్లాడుతూ ఇన్పుట్ డీలర్లు రైతులకు ఎరువులను, పంటల వారీగా, విడతల వారీగా ఇవ్వాలని తెలిపారు. ఈ ఖరీఫ్ సీజన్లో ఎరువుల కొరత లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెదకాకాని మండలంలోని రైతు సోదరులు, ఇన్పుట్ డీలర్లు మరియు గ్రోమోర్ మేనేజర్, పిఎసిఎస్ సీఈవోలు, వెంకటేశ్వరరావు, కిషోర్ మరియు శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

# నా దేశం నా బాధ్యతలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి

**- నా దేశం నా బాధ్యత లో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి - సీఎం మార్గనిర్దేశంలో పొదుపు చర్యలకు శ్రీకారం - ప్రజా ప్రతినిధులు, అధికారులు పొదుపు చర్యల్లో ప్రజలకు మోడల్‌గా నిలవాలి - ప్రజాప్రతినిధులు, అధికారులు ఎనర్జీ పొదుపులో భాగంగా నేటి నుండే చర్యలు - ఈవీ వాహనల వినియోగం, సోలార్ పవర్ ఎనర్జీపై అవగాహన పెంచుకోవాలి - అవసరమైన విభాగాల్లో వర్క్ఫ్రం హోంపై చర్యలపై సమాలోచన - బంగారం కొనుగోళ్లుపై స్వీయ నియంత్రణ పాటించాలి - దేశీయ టూరిజంకు పెద్దపీట వేయాలి - యుద్ధ పరిస్థితుల ప్రభావం తగ్గేలా ఇప్పటి నుండే చర్యలు తీసుకుందాం - విదేశీ మారక నిల్వలు తరిగిపోకుండా కాపాడుకుందాం : కొలుసు పార్థసారథి, సమాచార, పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖామాత్యులు**



**అమరావతి, (రాజధాని వార్తలు):** యుద్ధ వాతావరణ నేపథ్యంలో ప్రధాని మోదీ పిలుపులో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మార్గనిర్దేశంలో ప్రజాప్రతినిధులు, అధికారులు స్వయం పొదుపు చర్యలను పాటించనున్నామని సమాచార, పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖామాత్యులు కొలుసు పార్థసారథి తెలిపారు. ఏపీ సచివాలయంలోని ప్రచార విభాగంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ నాదేశం నా బాధ్యతలో భాగంగా ప్రతి ఒక్కరూ పొదుపు చర్యలు పాటించాలని పిలుపునిచ్చారు. క్యాబినేట్ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పొదుపు చర్యలపై దిశానిర్దశం చేశారన్నారు. ఇందులో భాగంగా ప్రజా ప్రతినిధులు, అధికారులు తమ వాహణ శ్రేణిలో వాహనాల సంఖ్యను స్వచ్ఛందంగా తగ్గించడం, సమావేశాలను ఆన్ లైన్‌లో వర్చువల్ గా నిర్వహించడం, వారానికి ఒక సారి నో వెహికల్ ఫ్రైడే పాటించడం తదితర చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే ప్రజలు సైతం స్వచ్ఛందంగా పొదుపు చర్యలు తీసుకోవాలని కోరారు. యుద్ధ వాతావరణ నేపథ్యంలో ఇందన అవసరాల తగ్గింపు, విదేశీ మారక నిల్వల పరిరక్షణ, రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు, అలాగే ఆయిల్, గ్యాస్, యూరియా తదితర దిగుమతుల తగ్గింపుతో నియంత్రణ పాటించడం వల్ల మేలు జరుగుతుందన్నారు. అరటి, ధాన్యం, వ్యవసాయ, ఉద్యానవన పంటల ఎగుమతులపై యుద్ధ ప్రభావం పడే అవకాశాలు ఉన్నాయన్నారు. అందుకనే ప్రజా ప్రతినిధులు, అధికారులు పొదుపు చర్యల్లో ప్రజలకు ఆదర్శంగా నిలవాలని, తాము పొదుపు చర్యలు పాటిస్తూ వారికి ఆదర్శంగా నిలవాలన్నారు. దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న సమయంలో మనందరం ఒక్క మాటపై నిలబడి కష్టాల నుండి బయటపడాలని అన్నారు. రాష్ట్రంలోని ప్రతి శాఖలోనూ గతంలో వాహనాలకు వినియోగించే ఆయిల్ పరిమితిని సాధ్యమైనంత తక్కువ ఉండేలా చూడటం, ప్రభుత్వం నూతన వాహనాలను కొనుగోలు చేయాలంటే ఈవీ వాహనాలనే కొనుగోలు చేయడం వంటి చర్యలతో పాటు ప్రజలను చైతన్య పరిచేలా విస్తృత ప్రచారం నిర్వహించనున్నామన్నారు. ప్రజలు వాకింగ్, సైక్లింగ్ తదితర పర్యావరణ హితమైన చర్యలు పాటించాలని, ప్రజా ప్రతినిధులు, అధికారులు పర్యటనల సమయంలో దగ్గర దూరాన్ని పాదయాత్రగా చేయాలని సూచించారు. వారానికి ఒక రోజు మంత్రులు, అధికారులు సైకిళ్లపై ఏపీ సచివాలయానికి వస్తే ఖచ్చితంగా అది ప్రజలపై ప్రభావం చూపి వారు సైతం అదే బాట పడతారన్నారు. రాష్ట్రంలోని విద్యా సంస్థల్లో వారానికి రెండు రోజులు నో వెహికల్ డేలుగా పాటించాలని సూచించారు. రాష్ట్రంలో ఈవీ స్టేషన్‌ల పెంపులో భాగంగా ఆయా సంస్థలకు ప్రోత్సాహకాలను అందిస్తామన్నారు. ట్రాఫిక్‌లో సైతం ఎక్కువసేపు వాహనాలు నిలవకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఆర్టీసీ సంస్థ తీసుకుంటున్న పొదుపు చర్యలపై సమీక్షిస్తామన్నారు. కేంద్రం రాష్ట్రానికి అందించనున్న ఈవీ బస్సులు త్వరగా రాష్ట్రానికి వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే పెద్ద పెద్ద విద్యాసంస్థలు, విశ్వవిద్యాలయాలు కూడా పొదుపులో భాగంగా ఆన్ లైన్ క్లాస్‌ల నిర్వహణపై సమాలోచన చేయాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అవసరమైన విభాగాల్లో వారానికి రెండు రోజులు వర్క్ ఫ్రం హోమ్ నిర్వహణపై పరిశీలన చేస్తున్నామన్నారు. స్వదేశీ టూరిజం, స్వదేశీ ప్రొడక్ట్స్‌పై ప్రజలు అవగాహన పెంచుకోవాలన్నారు. మన దేశంలోనే అద్భుతమైన పర్యాటక ప్రాంతాలు ఉన్నాయని, విదేశీ ప్రయాణాలు తగ్గించుకుని వేసవితో పాటు ఇతర సెలవు రోజుల్లో దేశంలోని ఆయా ప్రాంతాలకు వెళ్లాలని, అలాగే విదేశీ వస్తువుల కొనుగోళ్లను తగ్గించి స్వదేశీ తయారీ ఉత్పత్తులను ఎక్కువగా వాడాలని మంత్రి పార్థసారథి కోరారు. బంగారం కొనుగోళ్లపై నియంత్రణ పాటించాలని, మన దేశంలో వందల టన్నుల్లో బంగారం దిగుమతి చేసుకుంటున్నామని దీంతో విదేశీ మారక నిల్వలు తగ్గిపోతున్నాయని, కావున ప్రజలు స్వచ్ఛందంగా బంగారం కొనుగోళ్లు తగ్గించాలన్నారు. బంగారంపై మోజు తగ్గించుకుని కొద్ది రోజులు ఆగుదాం అని వేచి చూడటం వల్ల మన దేశం బంగారం దిగుమతులు తగ్గిస్తుందని వివరించారు. ఎనర్జీ ఉత్పత్తిలో భాగంగా సూర్యఘర్ పథకంలో భాగంగా ప్రతి ఇంటిపై సోలార్ ప్యానెల్స్ ను బిగించుకోవాలని మంత్రి పార్థసారథి సూచించారు. సోలార్ ప్యానెల్స్ బిగింపు కార్యక్రమంను వేగంగా చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి ప్రజలందరూ సిద్ధంగా ఉండాలన్నారు. రైతులు కూడా ఎరువుల వాడకం తగ్గించాలని, నానో ఎరువులు, సేంద్రియ ఎరువుల వాడకంపై అవగాహన పెంచుకోవాలన్నారు.

# విదేశీ పర్యటన ముగించుకొని తాడేపల్లికి వచ్చిన వైఎస్ జగన్మోహన్ రెడ్డికి స్వాగతం పలికిన పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** రెండు వారాల విదేశీ పర్యటన అనంతరం తాడేపల్లి నివాసానికి విచ్చేసిన మాజీ సిఎం వైయస్ జగన్మోహన్ రెడ్డిని వైఎస్‌ఆర్సిపి నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా వైయస్ జగన్మోహన్ రెడ్డితో చంద్రశేఖర్ రెడ్డి పలు అంశాలు చర్చించారు.

# 3న బహుజన మాట – పాట

## - విజయవాడకు తరలి రావాలని బీసీసీవీ జాతీయ అధ్యక్షులు శ్రీనివాస్ పిలుపు



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ద్రవిడ ఉద్యమ మహానేత, తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి 103వ జయంతి సందర్భంగా వచ్చే నెల మూడో తేదీ ఉదయం 10 గంటలకు విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బహుజన మాట -బహుజన పాట పేరిట సాంస్కృతిక చైతన్య కార్యక్రమం నిర్వ ఇస్తున్నట్టు బిసి చైతన్య వేదిక జాతీయ అధ్యక్షులు వీరవల్లి శ్రీనివాస్ తెలిపారు. నెల్లూరులోని ప్రెస్ క్లబ్లో బుధవారం ఉదయం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సాంస్కృతిక కార్యక్రమానికి జిల్లా నుంచి అధిక సంఖ్యలో బహుజనలు కదలి రావాలని పిలుపునిచ్చారు. దేశంలో బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనా ర్టీలు అధికంగా ఉన్నా వారు రాజ్యాధికారానికి, ఆర్థికపరంగా వెనుకబడి ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం పది నుంచి పదిహేను శాతం ఉన్న అగ్రవర్ణాల వారు రాజ్యాధికారాన్ని చేజిక్కిం చుకొని బహుజనలపై పెత్తనం కొనసాగిస్తున్నారని విమర్శించారు. 19 31లో మాత్రమే కుల గణన జరిగిందని, 1951 నుంచి జనగణన జరుగుతున్నా ఇప్పటివరకు కుల గణన జరగలేదని తెలిపారు ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం జన గణనతో పాటు బీసీ కుల గణనను సమగ్రంగా నిర్వహించి రాజకీయ రిజర్వేషన్ కల్పిం చాలని కోరారు. బీసీలకు రక్షణ చట్టం వెంటనే ఏర్పాటు చేయాలని, చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించాలని, స్థానిక సంస్థల్లో బీసీలకు 52 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీ అయిన ప్రధాని మోడీ ఈ డబల్యూఎస్ రిజర్వేషన్ అడగకపోయినా వారికి పది శాతం రిజర్వేషన్ కల్పించి బీసీలకు అన్యాయం చేశారని విమ ర్శించారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ను రద్దు చేయాలన్నారు. చట్ట సభల్లో మహిళలకు కేటాయించే 33 శాతం రిజర్వేషన్లలో బీసీ మహిళలకు సబ్ కోటా కింద రిజర్వేషన్ కల్పించాలని కోరారు. దేశంలో 85% రాష్ట్రంలో 56% వంతున బీసీలు ఉన్న 27% వంతెన వారికి రిజర్వేషన్ కల్పించడం ఏమిటని ప్రశ్నించారు. కులగనన చేసి జనాభా తమాషా ప్రకారం బహుజనలకు రిజర్వేషన్ కేటాయించాలన్నారు. బీసీ చైతన్య వేదిక గౌరవ సలహాదారు, మాజీ ఎమ్మెల్సీ బూధాటి రాధా కృష్ణయ్య మాట్లాడుతూ బహుజనలంతా ఏకమైతే రాజ్యాధికారం సాధించుకోవచ్చు అన్నారు. బీసీ చైతన్య వేదిక అధికార ప్రతినిధి డి.పద్మజ మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 78 ఏళ్లు గడుస్తున్న అధిక సంఖ్యలో ఉన్న బహుజనలు కొన్ని సామాజిక వర్గాల జెండాను అజెండాను మోస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు ఇకనైనా బహుజనలంతా ఏకతాటిపై కొచ్చి రాజ్యాధి కారాన్ని చేజిక్కించుకోవాలని పిలుపునిచ్చారు. తొలుత నాయకులు బహుజన మాట బహుజన పాట కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో నాసిన భాస్కర్ గౌడ్, చంద్రశేఖర్, శ్రీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పట్టుదల, క్రమశిక్షణతో విజయ శిఖరాలను అధిరోహించిన విద్యార్థి


Government of Andhra Pradesh
Department of School Education
APREI Society, Amaravati at Mangalagiri
APRJC INTER RESULT - 2026-27

JUVVALA JASWITH REDDY
Candidate ID : 2611049015
Hallticket No : 2652110006

| | | | |
|---|---|---|---|
| Gender | Male | Date of Birth | 22/05/2011 |
| Father's Name | J DAYAKAR REDDY | Caste | OC |
| If Differently Abled(PH) | No | Is CAP Candidate | No |
| Is Sports Candidate | No | Is Orphan Candidate | No |
| Group | EET | Rank | 33 |
| Total Marks | 150 | Obtained Marks | 77 |



**రేణిగుంట, (రాజధాని వార్తలు):** కష్టపడేతత్వం, లక్ష్యసాధనపై అచంచల నమ్మకం, తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యా యుల మార్గ దర్శకత్వం ఉంటే విద్యార్థులు ఎంతటి విజయాలనైనా సొంతం చేసుకోవచ్చని మరోసారి నిరూపించాడు జువ్వల జస్విత్ రెడ్డి. ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీ (ఏ.పి.ఆర్.జె.సి) ప్రవేశ పరీక్ష-2026లో అద్భుత ప్రతిభ కనబరిచి ఈఈటీ గ్రూప్లో రాష్ట్రస్థాయిలో 33వ ర్యాంక్ సాధించి గర్వకారణంగా నిలిచాడు. రేణిగుంట మండలం గాజులమండ్యం గ్రామానికి చెందిన జువ్వల దయాకర్ రెడ్డి కుమారుడైన జస్విత్ రెడ్డి చిన్నప్పటి నుంచే చదువుపై ప్రత్యేక ఆసక్తి కనబరుస్తూ ప్రతిభావంతుడిగా గుర్తింపు పొందాడు. తరగతి గదిలోనే కాకుండా పోటీ పరీక్షల్లో కూడా రాణించాలని లక్ష్యంగా పెట్టుకుని క్రమశిక్షణతో చదువుకుంటూ ఈ విజయాన్ని అందుకున్నాడు. ఏ.పీ.ఆర్.జె.సి ప్రవేశ పరీక్ష రాష్ట్రవ్యాప్తంగా ఎంతో పోటీతో కూడుకున్న పరీక్షగా గుర్తింపు పొందింది. ప్రతి సంవత్సరం వేలాది మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరవుతుంటారు. అలాంటి పోటీ వాతావరణంలో రాష్ట్రస్థాయిలో 33వ ర్యాంక్ సాధించడం సాధారణ విషయం కాదని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా ఈఈటీ గ్రూప్లో జస్విత్ సాధించిన ర్యాంక్ కుటుంబ సభ్యులు, బంధువులు, ఉపాధ్యాయులు, స్నేహితుల్లో ఆనందో త్సాహాలు నింపింది. అతని విజయాన్ని తెలుసుకున్న స్థానికులు అభినందనలతో ముంచెత్తుతున్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు మాట్లాడుతూ జస్విత్ చిన్నప్పటి నుంచే చదువుపై ఎంతో శ్రద్ధ చూపేవాడన్నారు. సమయపాలన, క్రమశిక్షణతో చదువుకుంటూ ఎప్పుడూ మంచి ఫలితాలు సాధించేవాడు అని తెలిపారు. ఇప్పుడు రాష్ట్రస్థాయిలో ర్యాంక్ సాధించడం కుటుంబానికి ఎంతో గర్వకారణం అని ఆనందం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ జస్విత్ చాలా మృదుస్వభావి, క్రమశిక్షణ కలిగిన విద్యార్థి. తరగతిలో ఎప్పుడూ చురుకుగా పాల్గొంటూ ప్రతి అంశాన్ని అర్థం చేసుకునేందుకు ఆసక్తి చూపేవాడు. అతని పట్టుదలే ఈ విజయానికి ప్రధాన కారణం అని ప్రశంసించారు. విద్యార్థి విజయానికి తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల సహకారం కూడా ముఖ్య కారణమని పలువురు అభిప్రాయపడ్డారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు కూడా సరైన దిశలో కష్టపడితే రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటగలరని జస్విత్ విజయం మరోసారి నిరూపించిందన్నారు. స్థానికులు మాట్లాడుతూ ఇలాంటి విద్యార్థులు రేణిగుంట ప్రాంతానికి మంచి పేరు తీసుకు వస్తున్నారు. భవిష్యత్తులో ఇంకా ఉన్నత స్థాయికి చేరుకొని సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు. జస్విత్ రెడ్డి మాట్లాడుతూ ఈ విజయానికి కారణమైన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో ఇంకా కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఉందని వినయంగా స్పందించాడు. అతని విజయం తెలుసుకున్న స్నేహితులు, బంధువులు, స్థానికులు ఇంటికి చేరుకుని అభినందనలు తెలిపారు.

మిఠాయిలు పంచుకొని ఆనందాన్ని వ్యక్తం చేశారు. పట్టుదల ఉంటే అసాధ్యం అనేది ఉండదు అనే మాటకు జస్విత్ రెడ్డి నిలువెత్తు ఉదాహరణగా నిలిచాడని పలువురు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో మరింత ఉన్నత విజయాలు సాధించి కుటుంబానికి, రేణిగుంట ప్రాంతానికి, రాష్ట్రానికి మంచి పేరు తీసుకు రావాలని అందరూ ఆశీర్వదిస్తున్నారు.

# టిడిపి 'మినీ మహానాడును విజయవంతం చేయాలి

## - టిడిపి రాష్ట్ర కమిటీ సభ్యులు శీలం కిరణ్ కుమార్



**గూడూరు, (రాజధాని వార్తలు):** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మహానాడులో భాగంగా ఈనెల 19వ తేదీన గూడూరులో ఎమ్మెల్యే, రాష్ట్ర టిడిపి ప్రధాన కార్యదర్శి డాక్టర్ పాశిం సునీల్ కుమార్ ఆధ్వర్యంలో జరగనున్న నియోజకవర్గ స్థాయి మినీ మహానాడును విజయవంతం చేయాలని టిడిపి రాష్ట్ర కమిటీ సభ్యులు శీలం కిరణ్ కుమార్ వెల్లడించారు. టిడిపి పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మినీ మహానాడులో పార్టీ కార్యకర్తలు, నాయకులు, అనుబంధ సంఘాల సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొని స్థానిక సమస్యలపై చర్చించి, తీర్మానాలను పార్లమెంట్ స్థాయి మహానాడుకు పంపిస్తామని ఆయన తెలిపారు. ఈనెల 27, 28 తేదీలలో కోవూరులో జరిగే మహానాడులో ఈ అంశాలను చర్చించి, 29న నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బిల్లు చెంచురామయ్య, తిరుపతి పార్లమెంటు జిల్లా అధికార ప్రతినిధి అబ్దుల్ రహీం, గూడూరు పట్టణ పార్టీ అధ్యక్షులు పులిమి శ్రీనివాసులు, నియోజకవర్గ అధికార ప్రతినిధి, పార్లమెంటు క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు ఇజ్రాయిల్ కుమార్, క్లస్టర్ ఇన్చార్జిలు నరసింహులు, వేమల సునీల్, ఎల్లసిరి శ్రీనివాసులు రెడ్డి, శివ కుమార్ పలువురు నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# గంజాయి అక్రమ రవాణా కేసులో నిందితుడికి 4 ఏళ్ల 2 నెలల కఠిన కారాగార శిక్ష

## - అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, ఐపీఎస్



**అనకాపల్లి (మాకవరపాలెం), (రాజధాని వార్తలు):** మత్తు పదార్థాల రహిత సమాజమే లక్ష్యంగా అనకాపల్లి జిల్లా పోలీసులు సాగిస్తున్న పోరా టంలో మరో కీలక విజయం లభించింది. మాకవరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో 2022లో నమోదైన గంజాయి అక్రమ రవాణా కేసులో నేరం నిరూపితం కావడంతో విశాఖపట్నం మెట్రోపాలి టన్ సెషన్స్ జడ్జి కోర్టు నిందితుడికి 04 సంవత్సరాల 02 నెలల కఠిన కారాగార శిక్ష అలాగే 5,000/- జరిమానా విధిస్తూ బుధవారం సంచలన తీర్పు వెలువరించింది. జరిమానా చెల్లించని యెడల అదనంగా మరో నెల రోజుల సాధారణ జైలు శిక్ష అను భవించాలని గౌరవ న్యాయమూర్తి ఎం.వెంకటనారాయణ తమ తీర్పులో పేర్కొన్నారు. శిక్ష పడిన నిందితుడి వివరాలు సెల్లదురై (A4), తండ్రి అన్నకోడి, వయస్సు 38 ఏళ్లు, వైగైనగర్, తేనిజిల్లా, తమిళనాడు రాష్ట్రం ఈ కేసు నేపథ్యం మరియు దర్యాప్తు మార్చి 24, 2022న మాకవరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని పైడిపాల జంక్షన్ వద్ద అప్పటి సబ్-ఇన్ స్పెక్టర్ ఎస్.సన్యాసిరావు సిబ్బం దితో కలిసి వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న నలుగురు వ్యక్తులు పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించగా, పోలీసులు వారిని వెంబడించి పట్టుకున్నారు. నిందితుల వద్ద తనిఖీలు నిర్వహించగా 08 కిలోల అక్రమ గంజాయి లభ్యమైంది. దీనిపై కేసు (జతీ.చీశీ. 73/2022 U/s 20(b)(ii)(B) r/w 8(c) of NDPS Act) నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. శాఖాపరమైన సమన్వయం అనకాపల్లి ఎస్పీ ఎస్పీ తుహిన్ సిన్హా, ఐపీఎస్ అభివందనాలు తెలిపారు. ఈ కేసులో పక్కా సాక్ష్యాధారాలతో అభియోగపత్రాన్ని దాఖలు చేసిన దర్యాప్తు అధికారిని, ప్రాసిక్యూషన్ తరపున సమ ర్థవంతమైన వాదనలు వినిపించిన అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.శ్రీనివాస్ని, జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ తుహిన్ సిన్హా, ఐపీఎస్ మాట్లాడుతూ జిల్లాలో గంజాయి సాగు, రవాణా మరియు వినియోగంపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. ముఖ్యంగా యువతను పక్కదారి పట్టిస్తున్న మత్తు పదార్థాల నియంత్రణకు 'సంకల్పం' వంటి కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పిస్తూనే, నేరస్థులకు శిక్ష పడేలా కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. ఈ తీర్పు పోలీసుల అంకితభావానికి మరియు న్యాయ వ్యవస్థపై ప్రజలకు ఉన్న నమ్మకానికి నిదర్శనమని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, ఐపీఎస్ పేర్కొన్నారు.

# త్రాగునీటి సరఫరా పరిశీలించిన కమిషనర్



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సామర్లకోట పట్టణ పరిధిలో బలుసుల పేట, గొల్లగూడెం ప్రాంతాల్లో మున్సిపల్ కుళాయిల నుండి త్రాగునీరు సరఫరా కావడం లేదని ఇటీవల మున్సిపల్ కార్యాలయం ముందు మాజీ మున్సిపల్ కౌన్సిలర్ నేతల హరిబాబు ఆధ్వర్యంలో బిందులతో మహిళలు నిరసన తెలియజేసిన విషయం విదితమే. దీంతో బుధవారం ఉదయం బలుసుల పేట, గొల్లగూడెం ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్ ఎ శ్రీవిద్య పర్యటించి త్రాగునీరు రాని ప్రదేశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల హెడ్ వాటర్ వర్క్స్ వద్ద కెనాల్ వాటర్ నిలిచిపోవడంతో గ్రౌండ్ వాటర్ సరఫరా చేయడం జరిగిందన్నారు. అయితే ప్రస్తుతం ఆ సమస్య తీరినందున అన్ని ప్రాంతాల్లో కుళాయిల నుండి మంచినీరు సరఫరా చేయడం జరుగుతున్నట్లు కమీషనర్ శ్రీవిద్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో మంచినీటి శాంపిల్స్‌ను సేకరించి దానిలో క్లోరిన్ శాతాన్ని పరిశీలించారు.

# కేటీఆర్‌తో ఆస్ట్రేలియా హైకమిషనర్ కీలక భేటీ.. పెట్టుబడులపై చర్చ



**హైదరాబాద్, (రాజధాని వార్తలు):** మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావుని భారతదేశంలోని ఆస్ట్రేలియా హైకమిషనర్ ఫిలిప్ గ్రీన్ కలిశారు. నందినగర్ నివాసంలో జరిగిన ఉన్నత స్థాయి భేటీలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఆస్ట్రేలియా హైకమిషనర్ ఫిలిప్ గ్రీన్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల ఆస్ట్రేలియా కాన్సుల్ జనరల్ హిల్లరీ మెక్‌గీచీతో సమావేశం అయ్యారు. పరస్పర ప్రయోజనాలు, వ్యూహాత్మక అంశాలపై విస్తృతంగా చర్చించారు. తెలుగు రాష్ట్రాల్లో ఆస్ట్రేలియా పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, సాంకేతిక రంగంలో పరస్పర సహకారం, విద్యా రంగంలో నూతన భాగస్వామ్యాల గురించి ప్రస్తావించారు. పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రిగా పనిచేసిన అనుభవం ఉన్న కేటీఆర్‌తో ఈ అంశంలో అనేక అంశాలపై చర్చించారు. ఐటీ, గ్రీన్ ఎనర్జీ, ఫార్మా, ఇన్నోవేషన్ రంగాల్లో హైదరాబాద్ కేంద్రంగా జరుగుతున్న అభివృద్ధిపై మాట్లాడారు. తెలంగాణ, ఆస్ట్రేలియా మధ్య సహకారం భవిష్యత్తులో స్థానిక యువతకు మరిన్ని అంతర్జాతీయ అవకాశాలను కల్పిస్తుందని కేటీఆర్ ఆశాభావం వ్యక్తం చేశారు. భారత్, ఆస్ట్రేలియా మధ్య ఉన్న దృఢమైన మైత్రిని మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లే దిశగా తీసుకునే చర్యలపై చర్చించారు. ఆస్ట్రేలియా ప్రతినిధులతో జరిగిన ఈ భేటీపై సంతోషం వ్యక్తం చేశారు కేటీఆర్. ఈ భాగస్వామ్యం ఇరుదేశాల ఆర్థిక వ్యవస్థలకు, సాంస్కృతిక బంధాలకు మరింత బలాన్ని చేకూరుస్తుందని కేటీఆర్ పేర్కొన్నారు.

# సీజనల్ వ్యాధులు పట్ల అప్రమత్తంగా ఉండండి

**అల్లవరం, (రాజధాని వార్తలు):** వాతావరణ పరిస్థితుల కారణంగా వస్తున్న సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధి కారి కే ఎన్ శ్రీనివాస్, సబ్ యూనిట్ అధికారి రామారావు అన్నారు. గోడిలంక, బెండమూర్లంక పిహెచ్ఈలను బుధవారం వారు తనిఖీ చేశారు. సీజనల్ వ్యాధులపై సిబ్బందికి అవగాహన కల్పించి సూచనలు, సలహాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రికార్డులను, తనిఖీ చేశారు. ల్యాబ్‌లో బ్లడ్ సప్లై రిపోర్ట్ తనిఖీ నిర్వహించారు. ఎం వన్ ఎం టు బుక్స్ వెరిఫికేషన్ చేసి వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.



# సంపాదకీయం

## మారిన రాజకీయం.. ప్రమాదంలో ప్రజాస్వామ్యం

ఇరవయ్యవ శతాబ్దం మొదటి ఐదు దశాబ్దాలు రెండు ప్రపంచ యుద్ధాలు, వలస పాలనకు వ్యతిరేకంగా స్వాతంత్ర్యం కోసం జరిగిన ఉద్యమాలు చరిత్రను చాలా మలుపులు తిప్పాయి. మన దేశం కూడా ఆ చరిత్రలో భాగమే. గత ఎనిమిది దశాబ్దాలుగా భారతదేశంలో రాజ్యాంగం ఆధారిత ప్రజాస్వామ్య వ్యవస్థ అమలులో ఉంది. స్వాతంత్ర్యోద్యమ నేపథ్యంలో వచ్చిన కొన్ని నవలల్లో మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది అని భావోద్వేగంతో ఒక మధ్యతరగతి ఒక పేదవాడికి చెపితే, "అయితే ఏమవుతుంది?" అని అమాయకంగా అడగడం మనోహర్ మలగాంకర్ తన 'బెండ్ ఇన్ గాంజెస్' అనే నవలలో రాశాడు. మన ప్రాంతంలో చాలా చర్చకు వచ్చిన కన్యాశుల్కంలోని జట్కావాడు... "భారతదేశానికి స్వాతంత్ర్యం రాబోతున్నది" అని గిరీశం అంటే- "మన ఊరిలోని హెడ్ కానిస్టేబుల్ మారతాడా?" అన్న ప్రశ్న చాలా దూరదృష్టితో రాసిందే. సంభాషణ చాలా సాధారణమైనదిగా కనిపించినా బలప్రయోగం లేని ఒక రాజ్యం వస్తుందా అన్న పేదవాడి ప్రశ్న అప్పటికంటే ఇప్పుడు ఎక్కువ రెలవెంట్ అనిపిస్తుంది. ప్రజాస్వామ్యం అంటే రాజ్య బలప్రయోగం మీద నియంత్రణ. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం చాలా ఆటుపోట్లకు గురయ్యింది. చాలా మూడవ ప్రపంచ దేశాలలో ఈ మాత్రం ప్రజాస్వామ్యం కొద్దికాలమైనా నిలువలేకపోయింది. చాలా దేశాలు నియంతృత్వంలోకి, సైనిక పాలనలోకి వెళ్లిపోయాయి. మన దేశంలో ప్రజాస్వామ్యం కొనసాగడానికి ఒక సమగ్రమైన రాజ్యాంగం తోడ్పడింది. బాబాసాహెబ్ అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రూపొందించడంలో కీలకమైన పాత్ర నిర్వహించాడనే కీర్తి ఆయనకు దక్కింది. రాజ్యాంగం మీద దాడి పెరిగిన కొద్దీ అంబేడ్కర్‌ను మననం చేసుకోవడం పెరుగుతున్నది. ఈ రాజ్యాంగంలోని ప్రాపంచిక దృక్పథం పెట్టుబడిదారీ ఆర్థిక నమూనాని ఒకవైపు అంగీకరిస్తూనే సోషలిస్టు సమాజ నిర్మాణం జరగాలని ఒక మధ్యేమార్గ ప్రయోగాన్ని వాగ్దానం చేసింది. ధనిక వర్గాలకి పెట్టుబడిదారీ పంథా, పేద వర్గాలకు సోషలిస్టు వ్యవస్థ అన్న ఒక మార్గం వేసే ప్రయత్నం చేసింది. దేశం ఎనిమిది దశాబ్దాలుగా ఒక చిక్కు మార్గంలోనే చిక్కుకుంది. ఏ ప్రజాస్వామ్య వ్యవస్థ అయినా పేదల ప్రస్తావన లేకుండా, అసమానతల తగ్గింపు, అందరికీ అవకాశాలు, మనుషులంతా సమానమే అన్న భావన లేకుండా నిలువడం కష్టం. అందరూ సమానమే అన్న భావనను డా. అంబేడ్కర్ చాలా దూరదృష్టితో, ఎన్నికలలో రాజకీయంగా మనం సమానత్వాన్ని కల్పించాం. ఒక మనిషి, ఒక ఓటు, ఒకే విలువ. ఈ సమానత్వం ఆర్థిక, సామాజిక సమానత్వాన్ని సాధించకపోతే మనం ఎంతో కష్టపడి నిర్మించుకున్న ప్రజాస్వామ్య సౌధాన్ని ప్రజలు బద్దలుకొడతారు అని హెచ్చరిక చేశాడు. కానీ విచిత్రంగా సామాన్య ప్రజలు రాజ్యాంగాన్ని స్వంతం చేసుకుంటున్నారు, పాలకులు రాజ్యాంగం మీద దాడి చేస్తున్నారు. ఎన్నికల రాజకీయాలలో రాజ్యాంగం కల్పించిన సమానత్వం డా.అంబేడ్కర్ ఆశించిన సమానత్వ దిశలో కాక సమాజంలోని తీవ్ర అసమానతలు ఎన్నికలను నిర్దేశించడంతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. గత ఎనిమిది దశాబ్దాలలో మొదటి రెండు దశాబ్దాలలో సోషలిస్టు నమూనా లాంటి వ్యవస్థ అన్న భావజాలం ప్రచారంలో ఉండేది. కానీ క్రమక్రమంగా పెట్టుబడిదారీ వ్యవస్థ బలపడుతూ వచ్చింది. ఇందిరా గాంధీ నాయకత్వంలో ఈ వైరుధ్యం కొంత స్పష్టత పొంది సమాజంలోని అసంతృప్తి విభిన్న ఉద్యమాలకు దారితీసింది. ఈ అసంతృప్తిని గ్రహించిన ఇందిరా గాంధీ పేదరికాన్ని రాజకీయాలలో ఒక ప్రధాన అంశంగా ముందుకు తీసుకు రావడంతో ఎన్నికలలో పెద్ద ఎత్తున ఓట్లను సమీకరించుకోగలిగారు. ఆమె భావజాలం వల్ల ధనిక వర్గాల సమీకరణ బలపడడం, పేద వర్గాల ఆకాంక్షలు పెరగడం వల్ల వైరుధ్యాలు తీవ్రతరం కావడంతో సంక్షోభంలో చిక్కుకున్న ఇందిరాగాంధీ... రాజ్యాంగంలో ప్రజలకు కల్పించిన ప్రాథమిక హక్కులను రద్దు చేసి, అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. భారతదేశంలోని 'రాజ్యాంగ ప్రజాస్వామ్యం' (కాన్‌స్టిట్యూషనల్ డెమోక్రసీ) ఎంత బలహీనంగా ఉందో ఒక్కసారి బయటపడింది. ఏ కారణం వల్ల ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ ఎత్తివేసి ఎన్నికలు ప్రకటించిందో ఇప్పటికీ ఆ కారణాలు పూర్తిగా విశ్లేషించలేదు. ఆమె ఎన్నికలు ప్రకటించినప్పుడు జయప్రకాశ్ నారాయణ్, అటల్‌బిహారీ వాజ్‌పాయ్, అరుణ్‌శౌరి కలిసి ప్రతిపక్షాలు ఏం చేయాలి అని చర్చించినప్పుడు అరుణ్‌శౌరి ఎన్నికలను బహిష్కరించాలి అని ప్రతిపాదిస్తూ... "నియంత ఎప్పుడూ తన విజయాన్ని గ్యారెంటీ చేసుకోకుండా ఎన్నికలకు వెళ్లరు" అని అంటే, "ప్రజలను మనం అంత తక్కువ అంచనా వేయకూడదు. సమాజం భయంలో ఉన్న మాట వాస్తవం. జనాన్ని మనం సమీకరించగలిగితే వ్యక్తులుగా భయపడుతున్న వాళ్లే సమిష్టిలో ధైర్యాన్ని కూడగట్టుకుంటారు. భయానికి మందు సమిష్టిలోనే ఉంది" అని జయప్రకాశ్ నారాయణ్ చెప్పారని అరుణ్‌శౌరి వ్యక్తిగత చర్చలో నాతో అన్నాడు. అటల్‌బిహారి వాజ్‌పాయ్ కూడా జేపీ వాదనతో అంగీకరించడంతో ఎన్నికలలో పాల్గొనాలనే నిర్ణయం తీసుకున్నామని అరుణ్‌శౌరి అన్నాడు. ఎన్నికల రాజకీయ చరిత్రలో మనదేశంలో 1977లో మొదటిసారిగా ప్రజలు భయం నుంచి బయటపడి అధికార పార్టీనే కాక, వ్యక్తిగతంగా ఇందిరాగాంధీని కూడా ఓడించారు. అప్పటి వరకు బలమైన నాయకుడు లేదా నాయకత్వం కేంద్రంగా నడిచే రాజకీయాల స్థానంలో సమిష్టి నాయకత్వం అధికారంలోకి వచ్చింది. భావజాలపరంగా భిన్న భావజాలాలున్న కమ్యూనిస్టు పార్టీ, జార్జ్ ఫెర్నాండెజ్, జగ్జీవన్‌రాం, మొరార్జీ దేశాయ్, అటల్‌బిహారీ వాజ్‌పాయ్, ఆడ్వాణీ... ఈ సమిష్టి నాయకత్వంలో భాగం. ఇంత వైవిధ్యమైన, వైరుధ్యమైన సంకీర్ణ ప్రభుత్వం ఎక్కువ కాలం నిలవలేకపోయింది.

# క్షయ వ్యాధి నిర్మూలనకు విస్తృత చర్యలు : కరప వైద్యాధికారులు

**- పెనుగుదురులో "టిబి ముక్త భారత్" కార్యక్రమం ప్రారంభం - కరప మండలంలో ఐదు రోజుల ప్రత్యేక శిబిరాలు**





**కరప, (రాజధాని వార్తలు):** భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "టిబి ముక్త భారత్" లక్ష్య సాధనలో భాగంగా క్షయ వ్యాధి నిర్మూలనకు విస్తృత చర్యలు చేపడుతోందని కరప వైద్యాధికారులు తెలిపారు. కాకినాడ రూరల్ కరప మండలం పెనుగుదురు సచివాలయంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అఫ్రోజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన టీ బీ ఎం బీ ఏ కార్యక్రమంలో మండల అధ్యక్షులు బండారు మురళి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "టిబి ముక్త భారత్" కార్యక్రమం కరప మండలంలో ఐదు రోజుల పాటు నిర్వహించబడుతుందని తెలిపారు. పెనుగుదురు, కరప, అరట్లకట్ట, జెడ్ భావారం, నడకుదురు గ్రామాలలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి టిబి పరీక్షలు చేపడుతున్నామని చెప్పారు. ప్రజలందరూ ముందుకు వచ్చి ఉచిత వైద్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు.

మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అఫ్రోజ్ మాట్లా డుతూ గ్రామాలు, పట్టణాల్లో ప్రత్యేక శిబిరాల ద్వారా ప్రజలకు ఉచిత పరీక్షలు, చికిత్సలు అందిస్తున్నట్లు తెలిపారు. బుధవారం పెనుగుదురులో కార్యక్రమాన్ని ప్రారంభించామని, శుక్రవారం అరట్లకట్ట, శనివారం జెడ్ భావారం, ఆదివారం నడకుదురులో కార్యక్రమాలు నిర్వ హించనున్నట్లు వెల్లడించారు. పెనుగుదురు గ్రామంలో సుమారు 150 మందికి పైగా టిబి పరీక్షలు నిర్వహిం చినట్లు తెలిపారు. రెండు వారాలకు పైగా దగ్గు ఉంటే వెంటనే పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. టిబి పూర్తిగా నయం అయ్యే వ్యాధి అని, వైద్యులు సూచించిన మందులను పూర్తిగా వాడటంతో పాటు పోషకాహారం తీసుకోవాలని చెప్పారు. టిబి రోగులను వివక్షకు గురి చేయకూడదని, వ్యాధి నిర్మూలనలో ప్రభుత్వంతో పాటు ప్రజల భాగస్వామ్యం కూడా ఎంతో అవసరమని పేర్కొన్నారు.

ప్రజలంతా అవగాహనతో ముందుకు వచ్చి టిబి పరీక్షలు చేయించుకుని క్షయ వ్యాధి నిర్మూలనకు సహకరిం చాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ తుమ్మలపల్లి మాచర్రావు, నీటి సంఘం అధ్యక్షులు తుమ్మలపల్లి గోవిందు రాజులు, గ్రామ అధ్యక్షులు గంటా నానిబాబు, జనసేన సీనియర్ నాయకులు యాళ్ల హరినాద్, వీర మహిళ గుబ్బల భవాని సత్తిబాబు, తుమ్మలపల్లి బాబులు, ఎస్సీ నాయకులు పూలపకురా మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# కరప మండలంలో స్వచ్ఛ పథం కార్యక్రమం




**కరప, (రాజధాని వార్తలు):** కాకినాడ రూరల్ కరప మండలం అరట్లకట్టలో బుధవారం నిర్వహించిన స్వచ్ఛ పథం కార్యక్రమాన్ని డిప్యూటీ ఎంపీడీవో సలాది వెంకట శ్రీనివాసరావు ప్రత్యక్షంగా పరిశీలించారు. కరప, గురజనాపల్లి, పెనుగుదురు, అరట్ల కట్ట వేళంగి, ఉప్పలంక మొదలగు గ్రామాలలో స్వచ్ఛ పథం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని రోడ్ల పక్కన పేరుకు పోయిన చెత్తను వర్గీకరించడం, వ్యర్థాల పోగులను తొలగించడం, వాటిని సంపద సృష్టి కేంద్రాలకు, కేటాయించిన ప్రదేశాలకు తరలించే పనులను అధికారులు సమీక్షించారు. అదేవిధంగా గ్రామంలో చేపడుతున్న శుభ్రత కార్యక్రమాలు, పర్యావరణ పరిరక్షణ చర్యలు, పాఠశాలలు, వీధులు, ప్రజా ప్రదేశాల్లో నిర్వహిస్తున్న పరిశుభ్రత పనులపై వారు సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామ ప్రజలు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, వ్యర్థాలను వేర్వేరు విధాలుగా వర్గీకరించి సరైన ప్రదేశాలకు తరలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయ సిబ్బంది, స్థానిక నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# పేదల పాలిట సంజీవని ముఖ్యమంత్రి సహాయ నిధి

**- ఆపదలో ఉన్న పేదలకు చంద్రన్న భరోసా..43.88 లక్షల చెక్కుల పంపిణీ - అమలాపురంలో రూ. 5.76 కోట్ల ముఖ్యమంత్రి సహాయ నిధి సాయం - 127 మందికి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఆనందరావు**



**అమలాపురం, (రాజధాని వార్తలు):** అనారోగ్యానికి గురై వైద్య ఖర్చులు పెనుభారంగా మారే పేద ప్రజల పాలిట దైవంలా ముఖ్యమంత్రి సహాయ నిధి సాయం నిలుస్తుందని అమలాపురం శాసన సభ్యులు అయితాబత్తుల ఆనందరావు కొనియాడారు. అమలాపురం హౌసింగ్ బోర్డు కాలనీలోని తన క్యాంపు కార్యాలయంలో 127 మంది లబ్ధిదారులకు 43,88,977 విలువైన సిఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన అందచేశారు. అమలాపురం నియోజకవర్గం పరిధిలో ఇప్పటివరకు ముఖ్యమంత్రి సహాయనిధి కింద రూ. 5.76 కోట్లు లబ్ధిదారులకు అందజేయడం జరిగిందన్నారు. ఈ నగదును నేరుగా లబ్ధిదారుల ఖాతాలోనికి జమ చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. అనారోగ్యం పాలై ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అందుతున్న ఈ సహాయం కొండంత భరోసానిస్తుందని అన్నారు. చంద్రబాబు నాయుడు పేదల సంక్షేమమే పరమావధిగా పాలన సాగిస్తున్నారని ఆపదలో ఉన్న ఎవరికైనా ముఖ్యమంత్రి కార్యాలయం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి పేద ప్రజలకు ఆర్థిక సహాయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు అందజేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి నూతన ఆలయ, విగ్రహ ప్రతిష్ట మహోత్సవం

**- అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే ఆనందరావు**

**- అధిక సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు, భారీ అన్న సమారాధన**




**అల్లవరం, (రాజధాని వార్తలు):** ఓడలరేవు గ్రామ దేవతగా కొలువైన శ్రీముత్యాలమ్మ అమ్మవారి నూతన ఆలయ, నూతన విగ్రహ ప్రతిష్ట మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సుమారు 120 ఏళ్ల క్రితం కొల్లు వెంకటరత్నంకి అమ్మవారు చిన్నపిల్లలా ప్రత్యక్షమై రంగుం (బర్మా) నుండి ఓడల రేవుకు చెందిన ఓడలో వచ్చానని తనకు ఇక్కడ ఆలయం నిర్మించి గ్రామదేవతగా ఉత్సవం నిర్వహిం చాలని కోరగా వెంకటరత్నం అమ్మవారికి ఆలయం నిర్మించారు. అనంతరం కొల్లు మూలస్వామి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసి గ్రామదేవతగా ప్రతిష్టించి జాతర, తీర్థ మహోత్సవాలను నిర్వహించడం ప్రారంభించారు. నాటి నుండి నేటి వరకు శ్రీముత్యాలమ్మ అమ్మవారు గ్రామదేవతగా తీర్థ మహోత్సవాలు అందుకుంటున్నారు. 120 ఏళ్ల క్రితం నిర్మించిన ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో ఆలయాన్ని తొలగించి నూతన ఆలయాన్ని, నూతన అమ్మవారి విగ్రహాన్ని గ్రామస్తులు పునర్నిర్మించారు. గత మూడు రోజులుగా అమ్మవారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవ ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించి బుధవారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం వేద పండితుల వేదమంత్రోచ్చారణ మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాలతోపాటు సుదూర ప్రాంతాల నుండి వేలాదిగా తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అధిక సంఖ్యలో మహిళలు అమ్మవారిని దర్శించుకుని చీర సారె సమర్పించి అమ్మవారి పసుపు కుంకమలను స్వీకరించారు. ఆలయ ప్రతిష్ట మహోత్సవం సందర్భంగా భారీ అన్నసమారాధన నిర్వహించారు. అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, మెట్ల రమణబాబు, అల్లాడ స్వామి నాయుడు, పెచ్చెట్టి చంద్రమౌళి, నడింపల్లి సుబ్రహ్మణ్యం రాజు, కడలి వెంకటేశ్వరరావు, పశ్చిమాల ఏడుకొండలు, నాగిడి నాగేశ్వరరావు, లంకె భీమరాజు, బొమ్మిడి లింగేశ్వరరావు అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని అమ్మవారిని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# "ఫియర్ లెస్" చిత్రానికి డిసిసిబి చైర్మన్ "క్లాప్"



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం పట్టణానికి చెందిన యువ దర్శకుడు గౌతమ్ నంద దర్శకత్వంలో నామయి మీడియా బ్యానర్‌పై నూత నంగా తెరకెక్కుతున్న "ఫియర్ లెస్" చిత్ర ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. పెద్దాపురం నామాయి మీడియా కార్యాలయంలో ఈ చిత్రాన్ని కాకినాడ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) క్లాప్ కొట్టి అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతలో అపారమైన ప్రతిభ, సృజనాత్మకత దాగి ఉందని, అవకాశాలు కల్పిస్తే వారు అన్ని రంగాల్లోనూ రాణించగలరన్నారు. ముఖ్యంగా సినిమా రంగంలో గ్రామీణ ప్రాంత యువత ముందుకు రావడం ఆనందకర విషయమన్నారు. పెద్దాపురం యువకులు తమ ప్రతిభతో సినీ రంగంలో కొత్త గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. జనసేన పార్టీ ఎప్పటికప్పుడు యువతకు అండగా నిలుస్తూ, వారి ఆలోచనలు, కలలు నిజం కావడానికి ప్రోత్సాహం అందిస్తుందని తెలిపారు. సమాజానికి మంచి సందేశం ఇచ్చే చిత్రాలు నిర్మించాలనే సంకల్పంతో ఈ బృందం ముందుకు రావడం అభినందనీయమని కొనియాడారు. స్థానిక యువత స్వయంకృషితో సినిమా నిర్మాణ రంగంలో అడుగుపెట్టడం పెద్దాపురం పట్టణానికి గర్వకారణమని, భవిష్యత్తులో మరెన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులు, జనసేన పార్టీ నాయకులు, అభిమానులు, సినీ అభిమానులు, స్థానిక యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లలో సమస్యలు పరిష్కరిస్తాం : మంత్రి ఉత్తమ్



**ఖమ్మం జిల్లా, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలో రైతులు పండించిన ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని తెలంగాణ పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ విషయంలో వరి రైతులు ఎవరూ అధైర్య పడవద్దని భరోసా కల్పించారు. గురువారం కూసుమంచి మండలం పాలేరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడారు. ట్రాన్స్‌పోర్ట్, హమాలీల విషయంలో కొంత ఇబ్బంది ఉందని చెప్పుకొచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా తిరిగి ఆ సమస్యను ప్రభుత్వం పరిష్కారింస్తోందని పేర్కొన్నారు. యాసంగిలో 85 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని తమ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని వెల్లడించారు. బిహార్, పశ్చిమబెంగాల్ నుంచి ఎక్కువగా హమాలీలు తెలంగాణకు వస్తారని చెప్పుకొచ్చారు. ఇటీవలే పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికలు జరగడం వల్ల హమాలీల కొరత ఏర్పడిందని తెలిపారు. కేవలం ధాన్యం తరలించడానికి లారీలు, డీసీఎంలు ఏర్పాటు చేయాలని అన్ని జిల్లాల కలెక్టర్‌లకు మంత్రి ఉత్తమ్ ఆదేశాలు జారీచేశారు.

# చాక్లెట్ డ్రెస్ లో ప్రగ్యా జైస్వాల్ 'కోకో' మ్యాజిక్!



తెలుగు తెరపై 'కంచె'తో క్లాస్ లుక్, 'అఖండ'తో మాస్ హిట్ అందుకున్న పొడుగుకాళ్ల సుందరి ప్రగ్యా జైస్వాల్, సోషల్ మీడియాలో మరోసారి హీట్ పెంచేసింది. తాజాగా ఆమె షేర్ చేసిన "కోకో కోచర్" ఫోటోలు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. చాక్లెట్ బ్రౌన్ కలర్ డ్రెస్సులో మెరిసిపోతున్న ప్రగ్యా..మరి ఆ అద్భుతమైన డ్రెస్ విశేషాలు మీకోసం..

**చాక్లెట్ బ్రౌన్ డ్రెస్సులో రాయల్ లుక్:**

ప్రగ్యా ఈసారి ఎంచుకున్న డ్రెస్ చాలా వెరైటీగా ఉంది. ప్రముఖ డిజైనర్ బబితా మల్కాని డిజైన్ చేసిన ఈ 'చాక్లెట్ బ్రౌన్ కోచర్' డ్రెస్ ఆమె ఫిగర్‌కు పర్ఫెక్ట్‌గా సెట్ అయ్యింది. ఇక ప్రీమియం సాటిన్ మరియు ఫాయిల్ జార్జెట్ ఫ్యాబ్రిక్‌తో రూపొందించిన ఈ గౌన్, ప్రగ్యాకు ఒక లగ్జరీ లుక్‌ను ఇచ్చింది. ముఖ్యంగా ఆ డ్రెస్సు రంగు ఆమె స్కిన్ టోన్‌కు మరింత గ్లోను జోడించింది.

**డిజైన్ హైలైట్స్ ఇవే:**

ఈ డ్రెస్సులో డిజైనర్ చూపించిన క్రియేటివిటీ అద్భుతం. బాడీ పార్ట్ దగ్గర సన్నని పైపులు మరియు థ్రెడ్ ఎంబ్రాయిడరీతో మెరుపులు జోడించారు. హై సైడ్ స్లిట్ ఉండటంతో ప్రగ్యా మరింత గ్లామరస్‌గా కనిపిస్తోంది. ఇక ఒకవైపు నేలను తాకేలా ఉన్న లాంగ్ టెయిల్ ఈ డ్రెస్‌కు ఒక 'మోడరన్ యువరాణి' కళను తెచ్చిపెట్టింది. దీనికి తగ్గట్టుగా ఆమె ధరించిన జ్యువెలరీ కూడా హైలైట్‌గా నిలిచింది.

**కెరీర్ పరంగా ఎలా ఉందంటే?:**

సినిమాల విషయానికి వస్తే, ప్రగ్యా జైస్వాల్ కెరీర్‌లో కంచె, జయ జానకి నాయక, అఖండ వంటి మంచి హిట్స్ ఉన్నప్పటికీ, ఆమెకు సరైన బ్రేక్ రావడం లేదు. సీనియర్ హీరోల పక్కన ఆమె జోడీ బాగుంటుందని పేరున్నా, ప్రస్తుతం అదృష్టం కోసం వేచి చూస్తోంది. అయితే అవకాశాలు ఉన్నా లేకున్నా, సోషల్ మీడియా ద్వారా తన అభిమానులను మాత్రం అస్సలు బోర్ కొట్టించదు ఈ అమ్మడు.

**అందానికి మెడిసిన్ ఏంటో తెలుసా?:**

ఇక ఇలాంటి ఫ్యాషన్ డ్రెస్సులు వేసుకోవడం, నచ్చినట్టుగా ఫోటో షూట్లు చేసుకోవడం వల్ల వచ్చే కాన్ఫిడెన్స్ మరియు ఆనందమే తన అందానికి రహస్యమని ఆమె పరోక్షంగా చెబుతోంది. ఆమె స్టైల్ మరియు కాన్ఫిడెన్స్ చూస్తుంటే అది నిజమే అనిపిస్తోంది. ప్రగ్యా జైస్వాల్ షేర్ చేసిన ఈ 'చాక్లెట్ బ్యూటీ' ఫోటోలు చూసి ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు. డ్రెస్సు ఏదైనా దానికి తనదైన స్టైల్‌తో ప్రాణం పోయడం ప్రగ్యాకు వెన్నతో పెట్టిన విద్య. మరి త్వరలోనే ఈ అమ్మడు మళ్ళీ వెండితెరపై పెద్ద సినిమాలతో మెరవాలని కోరుకుందాం.

# సీక్వెల్స్‌కు నో చెప్పిన రజనీ.. జైలర్2కి అందుకే ఓకే చెప్పారా?



సౌత్ ఇండస్ట్రీలో ఇప్పుడు అత్యంత ఆసక్తి రేపుతున్న ప్రాజెక్ట్‌లలో జైలర్2 ఒకటి. సెప్టెంబర్ 4 రిలీజ్ టార్గెట్‌తో షూటింగ్, పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ శరవేగంగా జరుగుతున్నాయని సమాచారం. ఈ సినిమాపై భారీ డిస్కషన్స్ జరగడానికి కారణం రజినీ కెరీర్‌లో ఆయన ఆల్మోస్ట్ సీక్వెల్స్‌కు దూరంగా ఉంటూ వచ్చారు. అలాంటి రజినీ ఇప్పుడు జైలర్2 కు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. ఆయన నటించిన సూపర్ హిట్ సినిమాలు బాషా, పడయప్పలాంటి ఐకానిక్ సినిమాలకు కూడా రజినీ సీక్వెల్స్ వద్దనుకున్నారు. అంతెందుకు బ్లాక్ బస్టర్ చంద్రముఖి సినిమాకు సీక్వెల్ వస్తే ఆ మ్యాజిక్‌ను మళ్లీ క్రియేట్ చేయలేమని సున్నితంగానే రిజెక్ట్ చేశారు. అలాంటి ఆయన ఇప్పుడు జైలర్2 రూపంలో మరోసారి సీక్వెల్ రిస్క్ తీసుకోవడం వెనుక ఉన్న అసలు కారణం డైరెక్టర్ నెల్సన్ దిలీప్‌కుమార్ అనే టాక్ బలంగా వినిపిస్తోంది. బీస్ట్ తర్వాత నెల్సన్ కెరీర్‌పై అందరూ అనుమానపడుతున్న టైమ్ లో సూపర్ స్టార్ అతన్ని నమ్మి జైలర్ కు ఓకే చెప్పారు. ఆ నమ్మకాన్ని నెల్సన్ కూడా నిలబెట్టుకోవడంతో, ఇప్పుడు జైలర్2 వరకు వీరి కాంబినేషన్ ప్రయాణం వచ్చింది. ముఖ్యంగా ఈసారి కథ పూర్తిస్థాయి సీక్వెల్‌గా కంటే, టైగర్ ముత్తువేల్ పాండియన్ గత జీవితాన్ని ఆవిష్కరించే ఎమోషనల్ యాక్షన్ డ్రామాగా ఉండబోతోందనే ప్రచారం ఆసక్తిని పెంచుతోంది. అంటే ఇది పార్ట్ 1 కొనసాగింపుతో పాటు ప్రీక్వెల్ టచ్ కలిగిన కథనమని ఇండస్ట్రీ వర్గాలు భావిస్తున్నాయి. ఇదే అంశం రజనీని ఒప్పించిందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఇక ఎస్జే సూర్య ఫుల్ లెంగ్త్ విలన్‌గా నటిస్తుండటం, మోహన్ లాల్, శివ రాజ్‌కుమార్ క్యామియోలతో జైలర్2 కు ఇప్పటికే పాన్ ఇండియా బజ్ ఏర్పడింది. సెప్టెంబర్ 4 గురువారం రిలీజ్ ప్లాన్ చేయడం వెనుక కూడా స్పష్టమైన బిజినెస్ స్ట్రాటజీ కనిపిస్తోంది. తర్వాతి వారం వినాయక చవితి సెలవులు ఉండటంతో లాంగ్ వీకెండ్‌ను పూర్తిగా క్యాష్ చేసుకోవాలని మేకర్స్ భావిస్తున్నట్టు తెలుస్తోంది. అయితే ఇండస్ట్రీలో మరో ఆసక్తికర చర్చ కూడా జరుగుతోంది. అదే రోబో 2.0 తర్వాత రజనీ మళ్లీ సీక్వెల్ రిస్క్ తీసుకోవడం. దీంతో జైలర్2 కూడా అదే తప్పును రిపీట్ చేస్తుందా? లేక కొత్త రికార్డులు సృష్టిస్తుందా? అన్న చర్చ మొదలైంది. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో సౌత్ ఇండస్ట్రీ మొత్తం సీక్వెల్స్ వైపు మొగ్గు చూపుతున్న తీరు గమనార్హం. బాహుబలి2, కెజిఎఫ్2, పుష్ప2 లాంటి సినిమాలు పాన్ ఇండియా మార్కెట్‌లో సీక్వెల్స్‌కు అపారమైన క్రేజ్ తీసుకువచ్చాయి.

మొదటి భాగంతో ఏర్పడిన భావోద్వేగ అనుబంధాన్ని, భారీ ఫ్యాన్ బేస్‌ను కొనసాగించ డానికి సీక్వెల్స్ ఇప్పుడు బలమైన కమర్షియల్ ఫార్ములాగా మారాయి. ఇదే ట్రెండ్‌ను రజనీ కూడా ఇప్పుడు తన స్టైల్‌లో పరీక్షించబోతున్నారు. ఈ నేపథ్యంలో జైలర్2 కేవలం మరో సీక్వెల్‌గా మిగులుతుందా? లేక రజనీ కెరీర్‌లో కొత్త చరిత్ర సృష్టిస్తుందా? అన్న ఆసక్తి రోజురోజుకీ పెరుగుతోంది.

# స్టార్ హీరోల నుంచి నేర్చుకున్న పాఠాలను చెప్పిన భాగ్యశ్రీ



మరాఠీ బ్యూటీ భాగ్యశ్రీ బోర్సే టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకునే ప్రయత్నాల్లో బిజీగా ఉంది. మిస్టర్ బచ్చన్ సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన ఈ యంగ్ హీరోయిన్‌కు తొలి సినిమా ఆశించిన విజయాన్ని అందించక పోయినా, ఆమె స్క్రీన్ ప్రెజెన్స్, గ్లామర్, డ్యాన్స్‌లకు మంచి స్పందన లభించింది. ఆ సినిమా తర్వాత వరుసగా పలు క్రేజీ ప్రాజెక్ట్‌లలో అవకాశాలు దక్కించుకున్న భాగ్యశ్రీ, యంగ్ హీరోలతో పాటు స్టార్ నటుల సరసన నటిస్తూ టాలీవుడ్‌లో తన స్థానం బలపరచుకునే ప్రయత్నం చేస్తోంది. ప్రస్తుతం ఆమె చేతిలో ఉన్న సినిమాలు కూడా ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. మిస్టర్ బచ్చన్ తర్వాత భాగ్యశ్రీ విజయ్ దేవరకొండతో కింగ్‌డమ్, రామ్ పోతినేనితో ఆంధ్ర కింగ్ తాలూకా, అలాగే దుల్కర్ సల్మాన్‌తో చేసిన కాంత సినిమాలు ఆమెకు నటిగా మంచి గుర్తింపుని తీసుకొచ్చినా, కమర్షియల్‌గా మాత్రం పెద్ద విజయాలు అందించలేకపోయాయి. అయితే ఈ ప్రయాణంలో తనతో కలిసి పనిచేసిన హీరోల నుంచి ఎంతో నేర్చుకున్నానని తాజాగా భాగ్యశ్రీ చెప్పుకొచ్చింది. రవితేజ నుంచి సహనం, సెట్స్‌లో ఆయన చూపించే ఎనర్జీని నేర్చుకున్నానని ఆమె వెల్లడించింది. అలాగే విజయ్ దేవరకొండ సినిమాపై చూపించే ప్యాషన్, ప్రతి సన్నివేశాన్ని మెరుగ్గా చేయాలనే తపన తనను బాగా ప్రభావితం చేసిందని తెలిపింది. ఇక రామ్ పోతినేని గురించి మాట్లాడుతూ, ఆయన కేవలం స్టార్ హీరో మాత్రమే కాకుండా అద్భుతమైన డ్యాన్సర్, కష్టపడే నటుడని ప్రశంసించింది. ప్రతి షాట్‌కు ఆయన పెట్టే డెడికేషన్ చూసి తాను చాలా విషయాలు గ్రహించానని చెప్పింది. మరో వైపు దుల్కర్ సల్మాన్ గురించి మాట్లాడుతూ, ఇప్పటికే సీనియర్ నటుడైనా కొత్త నటుడిలా ప్రతి సన్నివేశాన్ని ఆసక్తిగా చూడటం తనకు ఆశ్చర్యం కలిగించిందని పేర్కొంది. తాను ఇప్పటివరకు అద్భుతమైన కోస్టార్లతో కలిసి నటించానని భాగ్యశ్రీ అభిప్రాయపడింది. ఇప్పుడు భాగ్యశ్రీ ఆశలన్నీ అఖిల్ అక్కినేనితో చేస్తున్న లెనిన్ సినిమాపైనే నిలిచాయి. ఈ సినిమా ఆమె కెరీర్‌కు కీలక మలుపు అవుతుందనే అభిప్రాయాలు ఇండస్ట్రీలో వినిపిస్తున్నాయి. ఇప్పటికే వరుస సినిమాలతో బిజీగా ఉన్న భాగ్యశ్రీకి సరైన కమర్షియల్ హిట్ మాత్రమే కావాల్సి ఉందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. లెనిన్ విజయం సాధిస్తే ఆమె టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్ రేసులో మరింత ముందుకు వెళ్లే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. నటిగా మంచి అవకాశాలు దక్కించుకుంటున్న భాగ్యశ్రీ, ఈసారి మాత్రం విజయాన్ని కూడా అందుకోవాలని అభిమానులు ఆశిస్తున్నారు.

# పెద్ది.. ఇది కదా ఫ్యాన్స్‌కు కావాల్సింది..



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా తెరకెక్కుతున్న పెద్ది సినిమా ప్రమోషన్స్ ఇప్పుడు పాన్ ఇండియా లెవెల్‌లో హాట్ టాపిక్‌గా మారుతున్నాయి. విడుదలకు ముందే ఓ రేంజ్‌లో బజ్ తీసుకురావాలని భావించిన మూవీ టీమ్, పెద్ది పవర్ ప్లే టూర్ పేరుతో ఇండియా వైడ్‌గా ప్రమోషనల్ క్యాంపెయిన్ కు సిద్ధమైంది. ఫ్యాన్స్‌లో సినిమా మీద ఇప్పటికే ఉన్న అంచనాలను మరింత పెంచేలా ఆ టూర్‌ను డిజైన్ చేసినట్లు తెలుస్తోంది. 5 ఇటీవల విడుదలైన పోస్టర్లు, గ్లింప్స్, చరణ్ లుక్స్ సినిమాపై మంచి హైప్ క్రియేట్ చేశాయి. ముఖ్యంగా రామ్ చరణ్ క్రికెటర్ పాత్రలో కనిపించనున్నారనే విషయం అభిమానుల్లో ఆసక్తి పెంచింది. ఇప్పుడు అదే క్రేజ్‌ను మరింత పెంచడానికి మూవీ టీమ్ ప్రమోషన్స్ వైపు అడుగులు వేస్తోంది. ఆ టూర్ మే 18న ముంబైలో ప్రారంభం కానుంది. అక్కడే సినిమా ట్రైలర్‌ను విడుదల చేయాలని ప్లాన్ చేశారు మేకర్స్. ఆ తర్వాత మే 22న హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో స్పెషల్ ఈవెంట్ నిర్వహించనున్నారు. అదే రోజు ఐపీఎల్ 2026లో భాగంగా ఆర్సీబీ, సన్ రైజర్స్ హైదరాబాద్ మధ్య మ్యాచ్ జరగనుండటంతో స్టేడియంలో భారీ సంఖ్యలో ప్రేక్షకులు ఉండనున్నారు. ఆ వేదికను యూజ్ చేసుకుని పెద్ది టీమ్ సినిమా ప్రమోషన్‌ను మరింత గ్రాండ్‌గా చేయాలని భావిస్తోంది. ఇక టూర్ షెడ్యూల్‌ను కూడా మూవీ టీమ్ ప్రత్యేకంగా ప్రకటించింది. ముంబై తర్వాత భోపాల్, బెంగళూరు, ఢిల్లీ, చెన్నై, విజయనగరం, హైదరాబాద్ నగరాల్లో వరుసగా ఈవెంట్లు నిర్వహించనున్నారు. ముఖ్యంగా మే 23న భోపాల్‌లో స్పెషల్ సాంగ్ లాంచ్ ప్లాన్ చేయడం ఆసక్తికరంగా మారింది. నార్త్ ఆడియన్స్ ను కూడా టార్గెట్ చేస్తూ టీమ్ ముందుకు వెళ్తోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇక ప్రమోషన్స్ అనౌన్స్ చేసే విధానం కూడా సోషల్ మీడియాలో వైరల్ అయింది. 'షెడ్యూల్ ప్రకటించకపోతే ఉరేసుకుంటా' అంటూ రీసెంట్‌గా ఓ మెగా అభిమాని చేసిన పోస్ట్ ను ట్యాగ్ చేస్తూ మూవీ టీమ్ టూర్ డేట్స్ ను వెల్లడించింది. దీంతో అభిమానులు కూడా స్ట్రాటజీని బాగా ఎంజాయ్ చేస్తున్నారు. సోషల్ మీడియాలో పెద్ది పవర్ ప్లే టూర్ హ్యాష్ ట్యాగ్ ట్రెండ్ అవుతోంది. సినిమా విడుదల తేదీని జూన్ 4గా ఫిక్స్ చేశారు.

వేసవి సెలవులను దృష్టిలో పెట్టుకుని ఫ్యామిలీ ఆడియన్స్‌తో పాటు యూత్‌ను కూడా ఆకట్టుకునేలా ప్లానింగ్ చేసినట్లు తెలుస్తోంది. కమర్షియల్ ఎలిమెంట్స్‌తో పాటు భావోద్వేగాలకు సినిమాలో మంచి ప్రాధాన్యం ఉం టుందని టీమ్ చెబుతోంది. అయితే ఇప్పటికే టాలీవుడ్‌లో పాన్ ఇండియా ప్రమోషన్స్‌కు కొత్త ట్రెండ్ ఏర్పడుతోంది. అయితే పెద్ది టీమ్ చేస్తున్న పవర్ ప్లే టూర్ మాత్రం స్పోర్ట్స్, సినిమా, ఫ్యాన్ కల్చర్‌ను కలిపి మరింత పెద్ద రేంజ్‌లో ప్లాన్ చేసినట్లు కనిపిస్తోంది. ముఖ్యంగా స్టేడియం ఈవెంట్లు, సిటీ టూర్స్, స్పెషల్ సాంగ్ లాంచెస్ సినిమాకు మరింత హైప్ తీసుకురావడం ఖాయంగా కనిపిస్తోంది. ఇప్పుడు అభిమానులంతా ఒక్కటే ఎదురుచూస్తున్నారు.. ముంబై ఈవెంట్‌లో విడుదలయ్యే ట్రైలర్ ఎంతటి సంచలనం సృష్టిస్తుందోనని..

# మరుపల్లిలో బడి పిలిస్తోంది

**- ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు**

**- పదవ తరగతి పరీక్ష ఫలితాలలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కూడా అధిక మార్కులు సాధించారు : ఎం.ఈ.ఓ ఎస్.విమలమ్మ**




**గజపతినగరం, (రాజధాని వార్తలు):** బడి పిలుస్తుంది కార్యక్ర మంలో భాగంగా బుధవారం మండలంలోని మరుపల్లి గ్రామంలో మరుపల్లి ఎంపీపీఎస్, మరుపల్లి ఉన్నత పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు ర్యాలీ చేపట్టారు. ఇంటింటికి వెళ్లి పిల్లలు నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మండల విద్యాశాఖ అధికారి ఎస్.విమలమ్మ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో సుశిక్షితులైన ఉపాధ్యాయులు ఉన్నారని, నాణ్యమైన విద్య ప్రభుత్వ బడిలో మాత్రమే లభిస్తుందని ఆమె అన్నారు. గ్రామాల్లో ప్రభుత్వ బడులు మనుగడ సాగించాలంటే, విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడిలో మాత్రమే చేర్పించాలని కోరారు. ప్రభుత్వ బడిలో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వివరించారు. కొద్ది రోజుల క్రితం విడుదల చేసిన పదవ తరగతి పరీక్ష ఫలితాలలో ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అధిక మార్కులు సాధించారని ఎం.ఈ.ఓ విమలమ్మ అన్నారు. ఈ సందర్భంగా పది మంది విద్యార్థులు ప్రభుత్వ బడిలో చేరగా, వారికి అక్కడికక్కడే అడ్మిషన్లు రాసి పత్రాలు అందజేశారు. వీరిలో ఇద్దరు విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల నుంచి ప్రభుత్వ బడిలో చేరారు. ఈ ర్యాలీలో ఉపాధ్యాయులు రెడ్డి శంకరరావు, తాడ్డి సన్యాసిరావు, చప్పు కృష్ణవేణి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# జిల్లాలో 137.97 లక్షల పని దినాలు

**- రూ. 310.31 కోట్ల వేతనాల చెల్లింపులు : మంత్రి కొండపల్లి శ్రీనివాస్**

**విజయనగరం, (రాజధాని వార్తలు):** జిల్లాలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 137.97 లక్షల పనిదినాలు కల్పించినట్టు రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ బుధవారం పేర్కొన్నారు. పైన కల్పించిన పని దినాలకు వేతనాల రూపంలో రు. 310.31 కోట్లు చెల్లింపులు వారి ఖాతాల్లో వేసినట్టు కూడా మంత్రి తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి జనరేట్ చేసిన మెటీరీయల్ మొత్తం విలువ రు. 173.60 కోట్లు కాగా జనవరి నెల వరకు రు.71.67 కోట్లు చెల్లింపులు జరిగాయన్నారు. ఇంకా పెండింగ్ ఉన్న రు. 101.93 కోట్లను కూడా త్వరలోనే లబ్ధిదారుల ఖాతాలో జమ



చేయడం జరుగుతుందని మంత్రి తెలిపారు.

# సబ్ డివిజన్ సిబ్బందితో సమీక్ష సమావేశం

**- భీమా మేళాను విజయవంతం చేయండి : పోస్టల్ సూపరింటెండెంట్ కె.శ్రీనివాసు**





**గజపతినగరం, (రాజధాని వార్తలు):** గ్రామ స్థాయిలో భీమా విభాగంపై విస్తృతంగా అవగాహన కల్పించాలని విజయనగరం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ కె.శ్రీనివాసు అన్నారు. బుధవారం గజపతినగరం మార్కెట్ యార్డ్ ఆవరణలో సబ్ డివిజన్ పరిధిలో గల గజపతినగరం, దత్తిరాజేరు, పెదమానాపురం, చల్లపేట, గంట్యాడ, బొండపల్లి, పెదమజ్జిపాలెం, మెంటాడ సబ్ ఆఫీసు సిబ్బందితో కె శ్రీనివాస్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి హామీ పని చేస్తున్న ప్రజలకు భీమాపై అవగాహన కల్పించాలని, వారికి వారి కుటుంబానికి బీమా ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. అదేవిధంగా పట్టభద్రులు అందరికి వారు పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ చేసుకోవడానికి అర్హులన్న విషయం ప్రచారం చేయాలని ఆయన కోరారు. ఈ నెల 20 నుంచి 22 వరకు జరగనున్న మేళాను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ ఉపేంద్ర, సబ్ పోస్ట్ మాస్టర్లు, పోస్టల్ అసిస్టెంట్లు,సిబ్బంది పాల్గొన్నారు.

# కేరళం సీఎం వీడీ సతీశన్‌కు రేవంత్‌రెడ్డి అభినందనలు

**హైదరాబాద్, (రాజధాని వార్తలు):** కేరళం ముఖ్యమంత్రిగా ఎంపికైన వీడీ సతీశన్‌కు తెలంగాణ సీఎం ఎ. రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. కేరళం ప్రజలకు దశాబ్దాలుగా సేవ చేస్తూ... విలువలతో కూడిన రాజకీయాలు చేసే సతీశన్‌కు ఈ పదవి రావడం సముచిత గుర్తింపు అని సీఎం రేవంత్ అభిప్రాయపడ్డారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజల ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, సమగ్రాభివృద్ధికి మద్దతుగా విస్తృతంగా ప్రచారం చేసిన కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్‌కు అధికార బాధ్యతలు అప్పగించారని వ్యాఖ్యానించారు. విద్య, వైద్యం, అక్షరాస్యతలో కేరళం దేశానికి ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. సతీశన్ నాయకత్వంలో రాష్ట్రం మరింత అభివృద్ధి సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పెట్టుబడులు, నైపుణ్యాభివృద్ధి, పర్యాటకం, పరస్పర సహకారం వంటి రంగాల్లో కేరళం ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పుకొచ్చారు. కేరళం మరింత ప్రగతి, సుసంపన్నత దిశగా ముందుకు సాగాలని ఆకాంక్షిస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# పర్యాటక రంగంలో భారత్-అమెరికా బంధం బలోపేతం : మంత్రి దుర్గేశ్

**అమరావతి, (రాజధాని వార్తలు):** పర్యాటక రంగంలో భారత్ - అమెరికా బంధం బలోపేతమవుతోందని ఏపీ మంత్రి కందుల దుర్గేశ్ వ్యాఖ్యానించారు. ఆంధ్రప్రదేశ్‌కు అమెరికా పర్యాటక పెట్టుబడులే లక్ష్యంగా సచివాలయంలో మంత్రి దుర్గేశ్‌తో 'యూఎస్-ఇండియా స్ట్రాటజిక్ పార్టనర్‌షిప్ ఫోరమ్' భేటీ గురువారం జరిగింది. రాష్ట్ర పర్యాటక సంస్కరణలపై ప్రశంసలు - అమెరికా ఇన్వెస్టర్ల దృష్టికి ఏపీ పర్యాటక రంగం విధానాలను తీసుకెళ్తామని వెల్లడించారు. ఏపీని గ్లోబల్ టూరిజం హబ్‌గా మార్చే ప్రక్రియలో ఇలాంటి భాగస్వామ్యాలు ఎంతో కీలకమని ప్రకటించారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నేతృత్వంలో విదేశీ పెట్టుబడులకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. భారత్ - అమెరికా 75 ఏళ్ల మైత్రిపై మంత్రి దుర్గేశ్‌కి ప్రత్యేక



పుస్తకం అందజేశారు.

# వైద్యకళాశాల పనులను త్వరగా పూర్తి చేయాలి

**- నిర్మాణ కంపెనీపై కలెక్టర్ రాంసుందర్ రెడ్డి ఆగ్రహం**





**విజయనగరం, (రాజధాని వార్తలు):** ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి ఆదేశించారు. వచ్చే విద్యాసంవత్సరం నాటికి విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా వసతులను కల్పించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. సకాలంలో నిధులను వినియోగించకపోతే, అవి మురిగిపోయే అవకాశం కూడా ఉందన్నారు. మెడికల్ కాలేజ్ నిర్మాణ పనుల పురోగతిపై బుధవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఇప్పటివరకు పూర్తయినవి, ప్రగతిలో ఉన్నవి, ఇంకా చేపట్టాల్సిన పనులపై కలెక్టర్ ఆరా తీశారు. పనులు జరుగుతున్న తీరుపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తూ, వాటిని నిర్వహిస్తున్న ఎన్‌సిసి కంపెనీపై కలెక్టర్ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. నిర్మాణ పనులను పూర్తి చేయడంలో తీవ్ర జాప్యం చేస్తున్న కంపెనీపై చట్టపరంగా తగిన చర్యలను తీసుకోవాలని ఏపిఎంఎస్ఐడిసి అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

ఈ సమావేశంలో మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ దేవి మాధవి, జిజిహెచ్ సూపరింటిండెంట్ డాక్టర్ ఎ.పద్మజ, ఏపిఎంఎస్ఐడిసి ఎస్ఈ ఎం.విజయ్‌భాస్కర్, ఇఇ ఎన్.భార్గవి, ట్రాన్స్‌కో ఇఇ ఫణికుమార్, ఎన్‌సిసి డిజిఎం మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణిలో మహిళా డంపర్ ఆపరేటర్ల నియామకానికి శ్రీకారం

**హైదరాబాద్, (రాజధాని వార్తలు):** సింగరేణిలో మహిళా డంపర్ ఆపరేటర్ల నియామకానికి శ్రీకారం చుట్టారు. 13 దశాబ్దాల చరిత్రలో తొలిసారిగా భారీ డంపర్లను మహిళలు నడపనున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ చర్యలు చేపట్టారు. ఓపెన్ కాస్ట్ గనుల్లో 60 నుంచి 100 టన్నుల భారీ డంపర్ల నిర్వహణ కోసం మహిళలకు అవకాశం కల్పించారు. ఇప్పటికే 13 మంది మహిళా ఉద్యోగులు.. భారీ వాహనాల డ్రైవింగ్ శిక్షణ పూర్తి చేశారు. సిరిసిల్లలోని తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్ ఎడ్యుకేషన్ అండ్ స్కిల్స్ ద్వారా మహిళలకు ఉచితంగా ఈ శిక్షణ అందించారు. త్వరలో విడుదల కానున్న డంపర్ ఆపరేటర్ పోస్టుల్లో మహిళలకు అవకాశం ఇవ్వనున్నారు. పురుషులకు మాత్రమే పరిమితమైన ఉద్యోగాల్లో మహిళలకు ప్రాధాన్యం




ఇవ్వనున్నారు. ఇప్పటికే బెల్లంపల్లి ఖైరీగూడ గనిలో మహిళలతోనే బ్లాస్టింగ్ విభాగం నిర్వహణ చేపట్టారు. సింగరేణిలో తొలి మహిళా రెస్క్యూ జట్టును అధికారులు ఏర్పాటు చేశారు.

# పీఎంజే జ్యువెలరీ షాపులో దోపిడీ.. సుభోద్ గ్యాంగ్ పనే: సీపీ




**కరీంనగర్, (రాజధాని వార్తలు):** నగరంలోని పీఎంజే జ్యువెలరీ షాపులో కాల్పులు జరిపి.. నగలు దోపిడీకి పాల్పడింది సుభోద్ సింగ్ గ్యాంగ్ అని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం తెలిపారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు రఘునాథ్ కర్మాకర్ అలియాస్ జరిగాసింగ్ అని చెప్పారు. గురువారం కరీంనగర్‌లో పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సీపీ గౌస్ ఆలం విలేకర్లతో మాట్లాడుతూ ఈ దోపిడీకి సంబంధించిన వివరాలను వెల్లడించారు. మొత్తం 161.4 తులాల బంగారు ఆభరణాలను ఈ గ్యాంగ్ దొంగతనం చేసిందని వివరించారు. మొత్తం వీటి విలువ రూ. 82 లక్షలు ఉంటుందన్నారు. బిహార్‌కు చెందిన సుభోద్ గ్యాంగ్‌కి.. గోల్డెన్ తీఫ్‌గా పేరుందని గుర్తు చేశారు. పీఎంజే జ్యువెలరీ షాపులో ముందుగా రెక్కీ నిర్వహించి.. అనంతరం ఈ దోపిడీని ఈ గ్యాంగ్ చేసిందన్నారు. జార్ఖండ్, పశ్చిమ బెంగాల్ సరిహద్దుల్లోని మెహతాబ్ వద్ద ఈ ముఠా సెల్ ఫోన్, సిమ్స్ కొనుగోలు చేసినట్లు తమ విచారణలో వెల్లడైందన్నారు. ఖమ్మం, సిద్దిపేట, పెద్దపల్లి, కరీంనగర్‌లలో బంగారు షాపులపై ఈ గ్యాంగ్ రెక్కీ నిర్వహించిందని చెప్పారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు జాగీరా సింగ్ సహా ప్రద్యుమన్, మెహతాబ్ ఖాన్‌లను అరెస్ట్ చేశామని సీపీ తెలిపారు. వీరు నకిలీ ఆధార్, నకిలీ బైక్ నెంబర్లు, నకిలీ పేర్లతో తిరుగుతూ ఈ దోపిడీలకు పాల్పడతారని సీపీ గౌస్ ఆలం వివరించారు. రెండు నెలల ముందు ఈ గ్యాంగ్ తెలంగాణకు వచ్చిందని సీపీ గౌస్ ఆలం వివరించారు.

# మూడో దశ 'సర్' అమలుకు ఈసీ గ్రీన్ సిగ్నల్.. 16 రాష్ట్రాలు, 3 యూటీల్లో..

**ఇంటర్నెట్ డెస్క్:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఓటర్ల జాబితాల 'ప్రత్యేక సమగ్ర సవరణ(సర్)' ప్రక్రియను మిగిలిన రాష్ట్రాల్లో అమలు చేసేందుకు భారత ఎన్నికల సంఘం(ఈసీ) గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మూడో దశ కింద 16 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాలలో ఈ ప్రక్రియను నిర్వహించనున్నట్టు ఈసీ గురువారం ప్రకటించింది. ఇందులో హిమాచల్ ప్రదేశ్, జమ్ము కశ్మీర్, లద్దాఖ్‌లకు మినహాయింపునిస్తున్నట్టు ఈసీ పేర్కొంది. వాతావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ఆయా ప్రాంతాలకు త్వరలోనే షెడ్యూల్ ప్రకటిస్తామని స్పష్టం చేసింది. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) పేరిట చేపట్టిన ప్రక్షాళన కార్యక్రమం.. 2025 జూన్-సెప్టెంబర్‌లో బిహార్‌లో తొలి దశ కింద నిర్వహించారు. రెండో దశ 2025 అక్టోబర్ 27న.. ఉత్తర్‌ప్రదేశ్, పశ్చిమ బెంగాల్‌తో పాటు మొత్తం 9 రాష్ట్రాలు, 3 కేంద్రపాలిత ప్రాంతాల్లో ప్రారంభించింది ఈసీ. ఈ ప్రక్రియ ఫలితంగా మొత్తం ఓటర్ల సంఖ్య సుమారు 10.2 శాతం మేర తగ్గింది. దీంతో ఓటర్ల సంఖ్య 50.99 కోట్ల నుంచి 45.81 కోట్లకు పడిపోయింది. జనగణన ప్రక్రియలో భాగంగా కొనసాగుతున్న ఇళ్ల జాబితా తయారీకి ఉపయోగించే ఉమ్మడి క్షేత్రస్థాయి యంత్రాంగాన్ని దృష్టిలో ఉంచు




కుని మూడో దశ షెడ్యూల్‌ను ఖరారు చేసినట్లు ఈసీ తెలిపింది. ఈ దశలో 3.94 లక్షలకు పైగా బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) ఇంటింటికీ వెళ్లి 36.73 కోట్ల మంది ఓటర్లను సర్వే చేస్తారని పేర్కొంది. 'సర్' మూడో దశ షెడ్యూల్‌ను ప్రకటించిన అనంతరం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ మాట్లాడుతూ.. 'ఓటర్లందరూ ప్రత్యేక సమగ్ర సవరణలో ఉత్సాహంగా పాల్గొనాలి. అర్హులైన ఓటర్లు మాత్రమే ఉండేలా.. అనర్హుల పేర్లేవీ చేరకుండా చూసుకోవాలనే లక్ష్యంతో ఈ ప్రక్రియను నిర్వహిస్తున్నాం' అని అన్నారు.

# పెళ్లి బృందం వాహనానికి ప్రమాదం...!

## - బాలుడు మృతి, 15 మందికి తీవ్ర గాయాలు - అతివేగమే ప్రమాదానికి కారణం






**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** గండేపల్లి మండలం నాయికంపల్లి గ్రామం వద్ద శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తున్న బొలోరా వ్యాన్ వాహనం అదుపుతప్పి చెట్టును ఢీ కొట్టి బోదెలోకి వెళ్ళిపో యింది. ఈ ప్రమాదంలో పెద్దాపురం మండలం ఆనూరు గ్రామానికి చెందిన బాలుడు బత్తుల సుశాంత్ కుమార్ (14) అక్కడికక్కడే మృతి చెందగా మరో 15 మందికి తీవ్రంగా గాయాలయ్యాయి. బాధితులు అందించిన వివరాల ప్రకారం యల్లమిల్లి గ్రామంలో వివాహ కార్యక్రమానికి ఆర్బి కొత్తూరు గ్రామానికి చెందిన సుమారు 30 మంది ప్రజలు బొలెరో వ్యాన్‌పై వెళ్లి తిరుగు ప్రయాణంలో ఉండగా నాయకంపల్లి గ్రామం వద్ద డ్రైవర్ వాహనాన్ని వేగంగా నడపడంతో వాహనం అదుపు తప్పి ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో డ్రైవర్ బంధువైన ఆలూరు గ్రామానికి చెందిన సుశాంత్ కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. అయితే వ్యాన్‌లో ప్రయాణిస్తున్న 30 మందిలో 15 మందికి తీవ్ర గాయాలయ్యాయి. మిగిలిన వారికి కూడా స్వల్ప గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన క్షతగాత్రు లను పెద్దాపురం ఏరియా ఆసుపత్రికి బంధువులు తరలించగా దానిలో సుశాంత్ కుమార్ మృతి చెందగా మరొకరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉండడంతో స్థానిక ఆసుపత్రిలో వైద్య సేవలు అందిం చారు. మిగిలిన 13 మంది పరిస్థితి విషమంగా ఉండడంతో వారందరినీ మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే తీవ్రంగా గాయపడిన వారిలో మహిళలే అధిక సంఖ్యలో ఉన్నారు.

**ప్రమాదంపై ఎమ్మెల్యే విచారణ :**

పెళ్లి బృందం వాహనానికి జరిగిన ప్రమాదంపై పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఆరా తీశారు. పెద్దాపురం ఏరియా ఆసుపత్రిలో వైద్యం కోసం తరలించిన క్షతగాత్రులను ఎమ్మెల్యే పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. గాయపడిన అం దరికీ మెరుగైన వైద్యం అందేలా చూడాలని వైద్యాధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అలాగే జరిగిన ప్రమాదంపై పెద్దాపురం డిఎస్పి ఏ బాలగంగాధర్ తిలక్, సీఐ వై ఆర్ కే శ్రీనివాసరావు, ఎస్సై వి మౌనికలు విచారణ చేపట్టారు. సంఘటన స్థలంలో ఉన్న క్షతగాత్రుల బంధువుల నుండి డీఎస్పీ వివరాలు సేకరిం



చారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# రెవెన్యూ సేవలు వేగవంతం చేయాలి

## - రెవెన్యూ క్లినిక్‌లో వచ్చిన అర్జీలపై క్షేత్ర స్థాయిలో విచారణ చేసి సత్వరమే పరిష్కరించాలి - అనకాపల్లి జిల్లా జాయింట్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్






**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** అనకాపల్లి జిల్లాలోని రెవెన్యూ క్లినిక్‌లో వచ్చిన అర్జీలపై క్షేత్ర స్థాయిలో విచారణ చేసి సత్వరమే పరిష్క రించాలని, రెవెన్యూ సేవలలో సమయ పాలన, పారదర్శకత, బాధ్యతాయుత పరిపాలనను కట్టుదిట్టం చేయాలని జాయింట్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్ డి.ఆర్వో, ఆర్డీఓలు, తహసీల్దార్లను ఆదేశించారు. బుధవారం కలక్టరేట్ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ రెవెన్యూ, సర్వే మరియు భూమి రికార్డులు, పౌర సరఫరాల శాఖలపై మండల, డివిజన్‌ల వారిగా మరియు గ్రామ వార్డు సచివాలయల సర్వీస్‌లు, రెవెన్యూ క్లినిక్, పి జి ఆర్ ఎస్‌లలో వచ్చిన అర్జీలపై సమీక్ష నిర్వహించారు. ఈ సం దర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ సంబంధిత అధికారులు ప్రతి రోజు క్షేత్ర స్థాయిలో మానిటరింగ్ చేసి, రెవెన్యూ సేవలలో ఆలస్యం లేకుండా ప్రజలకు త్వరితగతిన సేవలు అందించాల న్నారు. ప్రభుత్వ భూములను పరిరక్షిస్తూ, ఆక్రమణలను నివారిం చేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో వివాదరహిత భూ రికార్డులు, బాధ్యతాయుత రెవెన్యూ పరిపాలన కోసం అధికారులు మరింత చురుకుగా పనిచేయాలన్నారు. ఆన్లైన్ సేవలు, భూ వ్యాపింగ్, రికార్డులు అప్డేషన్, మ్యుటేషన్ దరఖా స్తులు వంటి సమస్యలపై కార్యాచరణ ప్రణాళిక తయారు చేసుకొని పరిష్కరించాలన్నారు. లోపాలు ఉ న్న చోట వెంటనే సరిదిద్దాలని, నిర్ణీత సమయంలో నివేదికలు సమర్పించాలన్నారు. పిజిఆర్ఎస్, రెవిన్యూ క్లినిక్‌లలో ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే విచారణ చేయాలన్నారు. ఈ సమావేశంలో డి.ఆర్వో సుబ్బలక్ష్మి, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లు కె.మనోరమ, అనిత, అనకాపల్లి, నర్సీపట్నం ఆర్డీఓలు షేక్ అయిషా, వి.వి.రమణ, ఎడి సర్వే గోపాలరాజా, జిల్లా పౌర సరఫరాల అధికారి మరియు పౌర సరఫరాల సంస్థ డి.ఎం.లు కె.ఎన్.మూర్తి, కె జయంతి, అన్ని మండలాల తహసీల్దార్లు, సర్వేయర్లు, కలక్టరేట్ మేజిస్ట్రియల్, కో ఆర్డినేషన్, భూ వ్యవహారాల పర్యవేక్షకులు, తదితరులు పాల్గొన్నారు.

# సమ్మర్ క్యాంప్‌ల ద్వారా విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తి పెంపొందాలి

## - క్రీడా సామాగ్రి కిట్స్ పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్



**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** విద్యార్థుల శారీరక, మానసిక వికాసా నికి క్రీడలు ఎంతో దోహదపడతాయని అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ పేర్కొన్నారు. బుధవారం ఉదయం అనకాపల్లి కలెక్టరేట్‌లో సమ్మర్ క్యాంప్ ప్రత్యేక శిక్షణ కార్యక్రమం సందర్భం గా కశింకోట మండలం బయ్యవరం సెయింట్ జోసెఫ్ స్కూల్‌కు సంబంధించిన క్రీడా సామాగ్రి కిట్స్‌ను విద్యార్థులకు జిల్లా కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ మాట్లాడుతూ వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు క్రీడలు, వ్యాయామం, సృజనాత్మక కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. మే 1 నుండి మే 30, 2026 వరకు నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌లను విద్యార్థులు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి పెంపొందించేందుకు కృషి చేస్తున్న సంబంధిత గేమ్స్ కోచ్‌ను జిల్లా కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి పి.శైలజ, కోచ్ సిహెచ్.సూరి అప్పారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీలలో పేరుకు పోయిన వ్యర్థాలను వెంటనే తొలగించాలి : అనకాపల్లి జిల్లా కలెక్టరు విజయ క్రిష్ణన్






**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** అనకాపల్లి జిల్లాలోని అన్ని మండలా లు, గ్రామ పంచాయతీలలో పేరుకుపోయిన వ్యర్థాలను వెంటనే పూర్తిగా తొలగించి పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అనకాపల్లి జిల్లా కలెక్టరు విజయ క్రిష్ణన్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డిప్యూటీ ఎంపీడీఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడా కూడా వ్యర్థాలు లేకుండా సమగ్ర కార్యాచరణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మండలాలు, గ్రామ పంచాయతీలలో వ్యర్థాలను గుర్తింపు, విభజన, శుద్ధి మరియు శాశ్వత పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అవసరమైన యంత్రాలు, సిబ్బంది, నిధులను సమకూర్చికొని పనులను పురమాయించి వేగవంతం చేయాలని ఆదేశించారు.

ప్రతి మండలంలో గార్బేజ్ ట్రాన్సిట్ స్టేషన్లు ఏర్పాటు చేసి, చెత్త సేకరణ మరియు రవాణా వంటి వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. అన్ని వీధి దీపాలు సక్రమంగా వెలిగేలా చూసుకోవాలని, ఎక్కడా లోపాలు లేకుండా మరమ్మత్తులు ఉంటే తక్షణమే మరమ్మతులు చేయాలని సూచించారు. ప్రతి ఇంటిలో సొంత మరుగుదొడ్లు ఉండేలా, వాటిని వినియోగించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్ను వసూళ్లను మరింత మెరుగుపరచాలని, పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం ఉం డకుండా లక్ష్యాలను చేరుకుని జిల్లాను రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలపాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి సందీప్, డి ఎల్ డి ఓ, డిప్యూటీ ఎంపిడిఓలు తదితరులు పాల్గొన్నారు.

# వరి, మొక్కజొన్న, జొన్న కొనుగోళ్లలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విఫలం: మహేశ్వర్ రెడ్డి



**నిర్మల్, (రాజధాని వార్తలు):** వరి, మొక్కజొన్న, జొన్న కొనుగోళ్లలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విఫలమైందని బీజేపీ శాసనసభపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి విమర్శించారు. పంటల కొనుగోళ్లు చేయకపోవడంతో ప్రతిరోజూ రైతులు ఆందోళనలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెప్పుకొచ్చారు. ఇప్పటివరకు కనీసం 40 శాతం కూడా పంటల కొనుగోళ్లు ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. గురువారం నిర్మల్ జిల్లాలో రైతు ధర్నాలో మహేశ్వర్ రెడ్డి పాల్గొని మాట్లాడారు.

**రైతన్నలు తీవ్రంగా నష్టపోతున్నారు..**

పంట కొనుగోళ్లలో జాప్యంతో అన్నదాతలు ఇబ్బంది పడుతున్నా రని తెలిపారు. అకాల వర్షాలతో రైతన్నలు తీవ్రంగా నష్టపోతున్నా రని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చెబుతున్న మాటలకు.. వాస్తవ పరిస్థితికి పొంతన లేదని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గన్నీసంచులను కూడా సరఫరా చేయలేని దీనావస్థలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని విమర్శించారు. తడిసిన ధాన్యాన్ని పూర్తి మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. తేమ, తరుగు పేరిట రైతులను దగా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని మహేశ్వర్ రెడ్డి కోరారు.

# నీట్ పరీక్ష రద్దుపై పారదర్శక విచారణ జరగాల్సిందే : సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, (రాజధాని వార్తలు):** నీట్ యూజీ 2026 పరీక్ష రద్దుపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. నీట్ పేపర్ లీక్ ఘటనపై పారదర్శకంగా విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. పరీక్ష రద్దుతో లక్షలాది మంది విద్యార్థుల్లో ఆందోళన నెలకొందని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘట నతో దేశవ్యాప్తంగా 22.79 లక్షల మంది విద్యార్థులు షాక్‌కు గురయ్యారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం తరఫున కేంద్రానికి పలు సూచనలు చేశారు. విద్యార్థుల భవిష్య త్తును పేపర్ లీక్ ఘటనలు దెబ్బతీస్తున్న నేపథ్యంలో పరీక్షల విశ్వసనీయతను కేంద్రం కాపాడాలని రేవంత్ రెడ్డి కోరారు. పేపర్ లీక్ మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు మళ్లీ ఇబ్బందులు పడకుండా కేంద్ర ప్రభు త్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. అలాగే, నీట్ అక్రమాలపై పారదర్శకంగా దర్యాప్తు జరపాలని కోరారు. పోటీ పరీక్షలు అవకా శాల వేదికగా ఉండాలే తప్ప విద్యార్థుల జీవితాలను నాశనం చేసేలా మారకూడదని రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై కూడా తీవ్ర విమర్శలు గుప్పించారు. పరీక్షల నిర్వహణలో వైఫల్యాలు, పేపర్ లీక్ వంటి వాటిల్లో బీజేపీ, బీఆర్ఎస్‌ల మధ్య పోలిక ఉందంటూ సీఎం రేవంత్ రెడ్డి చురకలు అంటించారు.

# 45 డిగ్రీలు దాటనున్న ఎండలు.. ఉత్తర తెలంగాణకు రెడ్ అలర్ట్

**హైదరాబాద్, (రాజధాని వార్తలు):** ఉత్తర తెలంగాణకు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. మూడు రోజుల పాటు ఉత్తర తెలంగాణలో ఎండలు తీవ్రరూపం దాల్చనున్నట్లు ప్రకటించింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల జిల్లాలకు అలర్ట్ జారీ చేసింది. ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల సెల్సియస్‌ను దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ మూడు రోజులు వడగాలుల ప్రభావం కూడా తీవ్రంగా ఉండనుందని తెలిపింది. ఎండల తీవ్ర నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు పాటిం చాలని సూచించింది. అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని వాతావరణ శాఖ తెలిపింది. బయటకు వెళ్లవలసి వస్తే తప్పనిసరిగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచనలు జారీ చేసింది. ఎండల తీవ్రత కారణంగా ఆరోగ్య సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉందని వాతావణ శాఖ అధికారులు తెలి పారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారు ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call
# 9440662699, rajadhanivartalu.com

## EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యన్ ఆర్ ఐ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్శిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్శిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

## HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యంఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

## MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్:1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబంధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

## REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

## NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ చి.రమేష్, మంగళగిరి 0863-999999

## RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

## COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎష్టానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి పాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్స్పోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# వైభవోపేతంగా వీర్ల గోపి & స్వాతిల వివాహ మహోత్సవం



**గుడివాడ, (రాజధాని వార్తలు):** కీర్తిశేషులు వీర్ల వెంకటేశ్వర రావు, శ్రీమతి పద్మావతి దంపతుల కుమారుడు చి.గోపి వివాహం కృష్ణా జిల్లా, పెనమలూరు మండలం, కానూరు గ్రామ వాస్తవ్యులు గోరిపర్తి దుర్గారావు శ్రీమతి నాగలక్ష్మి దంపతుల కుమార్తె చి. స్వాతిల వివాహం 2026 మే 8న రాత్రి 7-19 ని.లకు విజయవాడ ఇంద్రకీలాద్రిలో కొలువైన శ్రీ దుర్గ మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో బంధుమిత్రుల మధ్య వైభవోపేతంగా జరిగింది. అనంతరం మే 10 ఆదివారం గుడివాడలోని ఏఎన్ఆర్ కాలేజీలో రిసెప్షన్ జరగగా అక్కినేని నాగేశ్వరరావు కళాశాల పాలకవర్గ సెక్రెటరీ & కరస్పాండెంట్ కాట్రగడ్డ సింహాద్రి అప్పరావు, ట్రెజరర్ పర్వతనేని కృష్ణ ప్రసాద్, ప్రిన్సిపల్ డాక్టర్ పి.జి.ఎస్.కుమార్, వైస్ ప్రిన్సిపల్ బి.ఎస్.ఎస్.పద్మజ, నర్ర మహేష్, కాజా శ్రీనివాసరావు, ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ ఆరిగా రామారావు అలాగే కళాశాల అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది మరియు గుంటూరు జిల్లా పరిషత్ సీఈవో వీర్ల జ్యోతి బోస్, ఆంధ్రా కోకో అసోసియేషన్ అధ్యక్షులు మడక ప్రసాద్, వివిధ రంగాల స్థానిక ప్రముఖులు మత్తి శ్రీకాంత్, జోగ బాలకృష్ణ యాదవ్, కొలుసు సతీష్ కుమార్ యాదవ్, జొన్నలగడ్డ రమేష్ బాబు యాదవ్, పల్లపోతు రంగారావు యాదవ్, బొమ్మనుబోయిన బాలాజీ యాదవ్, మెరుగుమాల ఫణి యాదవ్, వల్లం గంగరాజు యాదవ్, కోలుసు నాగరాజా యాదవ్, జోగ సూర్యప్రకాష్ రావు, లోయ శివాజీ యాదవ్, ఆర్ వి ఎల్ నరసింహారావు, జాజుల శ్రీనివాస రావు యాదవ్, నాలి రవిబాబు యాదవ్, మసి ముక్కురాంబాబు యాదవ్, గోరిపర్తి హరి నారాయణ యాదవ్, గోరిపర్తి దుర్గారావు &నాగలక్ష్మిలు, మచిలీపట్నం పుట్టి బ్రహ్మం యాదవ్, గుమ్మడి జాన్ మాన్యుల్ & శైలజ, మచిలీపట్నం కృష్ణా విశ్వవిద్యాలయ సిబ్బంది మత్తే నాగరాజు, పోతల రవీంద్ర, శివమణి, చేబ్రోలు సుధీర్, చేబ్రోలు ప్రకాష్ తదితరులు, కుటుంబ సభ్యులు వీర్ల వెంకటేశ్వరరావు, నల్లి బోయిన రవికుమార్, వీర్ల బ్రహ్మం, వీర్ల నాగరాజు, వీర్ల శ్రీరామ్ యాదవ్, వీర్ల వెంకటేశ్వరరావు, వీర్ల వేణుగోపాల్, వీర్ల వాసుదేవరావు యాదవ్, వీర్ల శ్రీనివాసరావు, వీర్ల సత్యం, వీర్ల పిచ్చయ్య, వీర్ల చంటి, వీర్ల దేవరయ్య, వీర్ల అగ్గి రామయ్య, వీర్ల కృష్ణ, వీర్ల సాంబయ్య, వీర్ల కృష్ణ కిషోర్, వీర్ల రాజేష్, వీర్ల కృష్ణమూర్తి, వీర్ల వడ్డీకాసులు, వీర్ల శిలువరాజు యాదవ్, కొలుసు చరణ్ బాబు, కొలుసు చలపతి, తలారి శ్రీరామ్ & శిరీష (సాఫ్ట్వేర్), జోగ నాగ కృష్ణ కిషోర్, పెద్దిబోయిన వెంకట సత్యనారాయణ, డొక్కు వెంకట నవీన్ కుమార్, వివిధ పార్టీల నాయకులు వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు తదితరులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదింపజేశారు.

# ట్యాంకర్‌ను ఢీ కొట్టిన బస్సు.. నలుగురు ప్రయాణికులు సజీవ దహనం

**గాంధీనగర్, (రాజధాని వార్తలు):** ట్యాంకర్‌ను ట్రావెల్స్ బస్సు ఢీ కొట్టడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో నలుగురు ప్రయాణికులు సజీవ దహనం అయ్యారు. మరో 10 మంది ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన గురువారం సురేంద్రనగర్ జిల్లాలో సంఘాని గ్రామ సమీపంలోని చోటిల్లా- రాజ్‌కోట్ జాతీయ రహదారిపై జరిగింది. క్షతగాత్రులను రాజ్‌కోట్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు వెల్లడించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ట్యాంకర్ టైర్ పేలడంతో.. అదుపు తప్పి ఎదురుగా ఉన్న రహదారిపైకి దూసుకొచ్చిందని పోలీసులు తెలిపారు. అదే సమయంలో వేగంగా వస్తున్న ట్రావెల్స్ బస్సు.. ఆ ట్యాంకర్‌ను ఢీకొట్టిందని వివరించారు. ఈ ప్రమాదం జరిగిన వెంటనే నిప్పురవ్వలు ఎగసిపడి.. క్షణాల్లో మంటలు చెలరేగాయని చెప్పారు. దీంతో బస్సులోని ప్రయాణికులు భయంతో కిందకి దూకి పరుగులు తీశారని పేర్కొన్నారు. అహ్మదాబాద్ నుంచి రాజ్‌కోట్‌కు ట్రావెల్స్ బస్సు వెళ్తుండగా ఈ దుర్ఘటన సంభవించిందని చెప్పారు. ఈ ప్రమాదంపై సమాచారం అందగానే.. అగ్నిమాపక శకటాలు ఘటన స్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకు వచ్చాయని తెలిపారు.

# కాకులపాడు గ్రామంలో వైభవంగా శ్రీశ్రీ బీరయ్య స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

## ముఖ్య అతిథులుగా మంత్రి సవిత, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకటరావు, ఎమ్మెల్యే చింతమనేని

**హనుమాన్ జంక్షన్, (రాజధాని వార్తలు):** కృష్ణాజిల్లా బాపులపాడు మండలం కాకులపాడు గ్రామంలో శ్రీ శ్రీ బీరయ్య స్వామి దేవస్థాన విగ్రహ ప్రతిష్ట మహోత్సవం బుధవారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ వేడుకకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన రాష్ట్ర మంత్రి సవిత, ఏపీ ప్రభుత్వ విప్ గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు, దెందులూరు శాసన సభ్యులు చింతమనేని ప్రభాకర్‌లకు ఆలయ కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం నూతనంగా ప్రతిష్టించిన బీరయ్య స్వామిని వారు దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కురుమ సంఘం, దేవస్థాన కమిటీ పెద్దలను,పుణ్య దంపతులను కలిసి సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, గన్నవరం నియోజకవర్గంలోని కాకులపాడు గ్రామంలో తమ కులదైవమైన బీరయ్య స్వామి ఆలయ ప్రారంభోత్సవానికి రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. స్థానిక ఎమ్మెల్యే కోరిక మేరకు కుల బాంధవుల కోసం భజన మందిర నిర్మాణానికి టీటీడీ ద్వారా నిధులు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చిన ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. హిందూ ధర్మాన్ని, దేవాలయాల పవిత్రతను కాపాడటమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యమని పేర్కొన్నారు. అలాగే ఎమ్మెల్యే కోరిన విధంగా బీసీ హాస్టళ్ల పునరుద్ధరణ పనులు ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్నాయని, ఈ నియోజకవర్గంలోని హాస్టళ్లను కూడా త్వరలోనే ఆధునీకరించి విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తామని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం అంటేనే బీసీల ప్రభుత్వమని ఆమె పునరుద్ఘాటించారు. అనంతరం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకటరావు మాట్లాడుతూ,తమ నియోజకవర్గ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి విచ్చేసిన మంత్రి సవితకు కృతజ్ఞతలు తెలిపారు. మల్లవల్లి పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి ద్వారా 15,000 మందికి ఉపాధి కల్పించడమే కాకుండా, సీఎస్ఆర్ నిధుల ద్వారా శిక్షణ కేంద్రాలు, హెచ్‌సిఎల్ కంపెనీ సహకారంతో హాస్టళ్లలో ఆర్ఓ ప్లాంట్లు, టాయిలెట్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు వివరించారు. తాను క్షేత్రస్థాయిలో పర్యటించినప్పుడు హాస్టళ్ల పరిస్థితి అధ్వాన్నంగా ఉండటాన్ని గమనించానని, అందుకే మంత్రి సవిత చొరవతో నియోజకవర్గంలోని బీసీ సంక్షేమ హాస్టళ్లను మరింత అభివృద్ధి చేయాలని కోరారు.

కాగా ఈ కార్యక్రమానికి ముందు హనుమాన్ జంక్షన్ కూడలిలోని అభయ అనజనేయ స్వామి వారిని దర్శిం చుకుని ప్రత్యేక పూజలు



నిర్వహించారు. ర్యాలీగా కాకులపాడు గ్రామం చేరుకున్న నేతలకు గ్రామ నాయకులు, కురభ సంఘం నేతలు గజమాలతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షులు, విజయ్ విద్యా సంస్థల చైర్మన్ తట్టి అర్జునరావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో కురుమ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్ర అప్పన్న, రాష్ట్ర కురుమ సంఘ వర్కింగ్ ప్రెసిడెంట్ రెడ్డి ప్రసాద్, గుంటూరు జిల్లా కురుమ సంఘం అధ్యక్షులు మర్రి సత్యనారాయణ,కృష్ణా జిల్లా కురుమ సంఘం అధ్యక్షులు, మల్లయ్య స్వీట్స్ అధినేత గౌరా వెంకటేశ్వ రరావు,వెస్ట్ గోదావరి కురుమ సంఘం ప్రెసిడెంట్ దన్నే అశోక్, బీరయ్యస్వామి దేవాలయం ప్రెసిడెంట్, కృష్ణాజిల్లా కురుమ సంఘం సెక్రటరీ ఎనికేపల్లి శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్ పడకల రాజశేఖర్, కాకులపాడు గ్రామ టిడిపి అధ్యక్షులు చెన్ను బోయిన వీర వెంకట్రావు, గన్నవరం నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్ బాబు,బాపులపాడు మండల టిడిపి అధ్యక్షులు దయాల రాజేశ్వరరావు, కొమ్మారెడ్డి రాజేష్, చలసాని శ్రీనివాసరావు, అన్నె చైతన్య,పుట్టా సురేష్, మూల్పూరి సాయి కళ్యాణి, ఆళ్ల గోపాలకృష్ణ, మొవ్వ వేణుగోపాల్, వేగిరెడ్డి పాపారావు, జాస్తి భూపతి, యజ్జువరపు శ్రీనివాసరావు, మున్నంగి శేషగిరిరావు, దన్నే గాంధీ, దన్నే దుర్గారావు, చెన్నుబో యిన అంజయ్య, చింతల వెంకట శివ అప్పారావు, చెన్నుబోయిన నాగరాజు, యజ్జువరపు రంగారావు, అట్లూరి శ్రీనివాసరావు, ఎనికేపల్లి నారాయణ, ఎనికేపల్లి రాఘవేంద్రరావు, ముదిగిరి నాగేశ్వరరావు, జోగు సుబ్రహ్మణ్యం, చెన్నుబోయిన మల్లిఖా ర్జునరావు, కొల్లూరు చంద్రకాంత్ మరియు స్థానిక భక్తులు, కురుమ సంఘం నాయకులు, ఎన్డీయే కూటమి నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan